జగన్‌కు ఓటేయకండి..

దళిత గర్జన సభలో హర్షకుమార్

- 7లో



కరాటేలో తలపడుతున్న క్రీడాకారులు

రాష్ట్ర స్థాయి కరాటే పోటీల్లో

కోనసీమ ప్రథమం



కరాటే పోటీలను ప్రారంభిస్తున్న టీడీపీ నాయకుడు రమణబాబు

అమలాపురం టౌన్, ఫిబ్రవరి 11: రాష్ట్రస్థాయి కరాటే పోటీల్లో డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా ప్రథమ స్థానంలో నిలిచింది. అమలాపురం దుడ్డువారి అగ్రహారంలోని ముస్లిం షాదీఖానా భవనంలో నాల్గవ రాష్ట్రస్థాయి ఇన్విటేషనల్ కరాటే చాంపియన్‌షిప్-2024 పోటీలు ఆదివారం నిర్వహించారు. ఉమ్మడి పూర్వపు జిల్లాలతో పాటు విశాఖపట్నం, గుంటూరు, బాపట్ల జిల్లాలకు చెందిన సుమారు 600 మంది క్రీడాకారులు పోటీల్లో పాల్గొన్నారు. వీటిని టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి మెట్ల రమణబాబు, యునైటెడ్ షోటోకాన్ కరాటే దూ ఇండియా జాతీయ అధ్యక్షుడు ఎం.హైదర్‌ఆలీ ప్రారంభించారు. పవర్‌కిక్ షోటోకాన్ కరాటే దూ అసోసియేషన్ ఆధ్వర్యంలో చీఫ్ ఆర్గనైజర్ పడాల అంజి, సీనియర్ కరాటే మాస్టారు పి.చంటి పర్యవేక్షణలో జూనియర్, సబ్ జూనియర్, సీనియర్స్ విభాగాల్లో పోటీలు నిర్వహించారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు జరిగిన ఈ పోటీలకు న్యాయ నిర్ణేతలుగా అల్లాడ రవి, కుప్పాడ బుజ్జి, డి.సాయిబాబు, చిక్కం సురేష్, ఎ.ప్రసన్న, టి.యశ్వంత్, డి.సంధ్య వ్యవహరించారు. జిల్లా జట్టు ప్రథమ స్థానం సాధించగా రాజమహేంద్రవరం జిల్లా జట్టు ద్వితీయ, కాకినాడ జిల్లా జట్టు తృతీయ స్థానాలు సాధించాయి. ఆయా జిల్లాల జట్లకు ట్రోఫీలు అందజేశారు. బహుమతి ప్రదానోత్సవ సభలో రమణబాబుతో పాటు పలువురు వక్తలు మాట్లాడుతూ ఆత్మరక్షణతో పాటు మనోధైర్యానికి, సంపూర్ణ ఆరోగ్యంతో జీవించేందుకు కరాటే ఎంతగానో దోహదపడుతుందన్నారు. ఈ సందర్భంగా చీఫ్ ఆర్గనైజర్ పడాల అంజిని ప్రత్యేకంగా అభినందించి సత్కరించారు. సుమారు వంద మందికి స్వర్ణ పతకాలు అందజేశారు. యానాం కమలానెహ్రూ బాలికోన్నత పాఠశాల విద్యార్థులు ఎ.మనీష, వి.ధనశ్రీ స్వర్ణ పతకాలు సాధించారు. కోచ్‌గా యనమదల రాజరాజేశ్వరి వ్యవహరించారు. కార్యక్రమంలో పి.చంటిరాజు, చిక్కాల పనసయ్య, నల్లా స్వామి, బొర్రా వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొని విజేతలను అభినందించారు.



మంగళగిరిలో పవన్‌కల్యాణ్‌ను కలిసిన జనసేన అమలాపురం లోక్‌సభ ఇన్‌చార్జి డీఎంఆర్ శేఖర్‌తో పాటు ఆ పార్టీ నేతలు

అమలాపురం కోసం

జనసేన పట్టు!

- లోక్‌సభ, మూడు రిజర్వుడు అసెంబ్లీ స్థానాలకై డిమాండ్
- ససేమిరా అంటున్న టీడీపీ నేతలు
- ఈ నెల 15న పవన్ అమలాపురం పర్యటన?
- పవన్‌ను కలిసిన లోక్‌సభ జనసేన ఇన్‌చార్జి శేఖర్

(అమలాపురం-ఆంధ్రజ్యోతి)

డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా కేంద్రమైన అమలాపురం సీటు కోసం జనసేన పట్టుబడుతోంది. ఎస్సీ రిజర్వుడు నియోజకవర్గమైన అమలాపురం లోక్‌సభతో పాటు అసెంబ్లీ స్థానాన్ని కూడా జనసేనకే కేటాయించాలంటూ ఆ పార్టీ అధ్యక్షుడు పవన్ కల్యాణ్ పట్టుబడుతున్నట్టు విశ్వసనీయంగా తెలిసింది. జిల్లాలో ఉన్న మూడు ఎస్సీ రిజర్వుడు స్థానాలతో పాటు లోక్‌సభ స్థానాన్ని కూడా జనసేనకే ఇవ్వాలనే తాజా ప్రతిపాదన టీడీపీ వర్గీయుల్లో గుబులు రేకెత్తిస్తోంది. అయితే అసలుకు ఎసరు పెడితే గానీ కొసరుకు రారనే సామెత మాదిరిగా జనసేన పట్టుబడుతున్నప్పటికీ రెండు అసెంబ్లీ రిజర్వుడు స్థానాలు మాత్రమే జిల్లా నుంచి కేటాయించే అవకాశం ఉన్నట్టు తెలుస్తోంది. ఇప్పటికే రాజోలు ఎస్సీ రిజర్వుడు నియోజకవర్గం జనసేనకు సిట్టింగ్ స్థానం కావడంతో ఆ పార్టీ అభ్యర్థి పోటీ చేస్తారని పవన్‌కల్యాణ్ ప్రకటన చేశారు. మూడు ఎస్సీ నియోజకవర్గాలు జనసేనకే ఇవ్వాలని పట్టుబడుతున్నందున పి.గన్నవరం నియోజకవర్గాన్ని జనసేనకు కేటాయించాలని, అమలాపురాన్ని ఎట్టి పరిస్థితిలోనూ వదులుకునే ప్రసక్తే లేదని టీడీపీ నేతలు స్పష్టం చేస్తున్నారు. మూడు ఎస్సీ రిజర్వుడు స్థానాలు జనసేనకు కేటాయిస్తే లోక్‌సభ స్థానం కూడా తనకే ఇవ్వాలన్న పట్టుదలతో పవన్‌కల్యాణ్ ఉన్నట్టు ఆ పార్టీ నేతలు ప్రచారం చేస్తున్నారు. ఇటీవల అమలాపురం జనసేన లోక్‌సభ ఇన్‌చార్జి డీఎంఆర్ శేఖర్, ఆయన సతీమణి దుర్గాభవానీ, పార్టీ నాయకులు నల్లా శ్రీధర్, యాళ్ల నాగసతీష్, కంచిపల్లి అబ్బులు తదితరులు మంగళగిరిలో పవన్‌కల్యాణ్‌ను కలిసి అమలాపురం కేంద్రంగా జనసేనకు మంచి పట్టు, ప్రజల్లో ఉన్న ఆదరణ దృష్ట్యా ఎట్టి పరిస్థితుల్లోనూ ఎన్నికల్లో విజయకేతనం ఎగరవేసే అవకాశాలు ఉన్నాయని, అందుకు తగిన విధంగా ప్రణాళికలతో ముందుకు సాగాలన్న డీఎంఆర్ శేఖర్ సూచనతో తాజా డిమాండ్లు వెలుగులోకి వచ్చినట్టు శేఖర్ వర్గీయులు పేర్కొంటున్నారు. ఇందులో భాగంగా ఈ నెల 15న పవన్‌కల్యాణ్ అమలాపురంలో పర్యటించి నేతల అభిప్రాయాలు సేకరించిన తర్వాత నిర్ణయాన్ని ప్రకటిస్తారని తెలుస్తోంది. అయితే ఎట్టి పరిస్థితుల్లో అమలాపురం లోక్‌సభ, అసెంబ్లీ స్థానాలను వదులుకునే ప్రసక్తి లేదంటూ టీడీపీ నేతలు కౌంటర్ ఎటాక్‌కు సిద్ధమయ్యారు. ఈ నేపథ్యంలో ఈనెల 15వ తేదీన పవన్‌కల్యాణ్ పర్యటన కోనసీమ ప్రజల్లో ఉత్కంఠ రేపుతోంది. అమలాపురం అసెంబ్లీ స్థానం నుంచి ఇప్పటికే శెట్టిబత్తుల రాజబాబు ఇన్‌చార్జిగా ఉంటూ మహాసంకల్ప యాత్రను గత 99 రోజులుగా కొనసాగిస్తున్నారు. అయితే ఇక్కడ డీఎంఆర్ శేఖర్, శెట్టిబత్తుల రాజబాబు వర్గీయుల మధ్య ఉన్న విభేదాల నేపథ్యంలో పార్టీ విజయావకాశాలకు గండిపడే అవకాశం ఉన్న దృష్ట్యా ఆలోచించి అడుగు వేయాలనే యోచనలో అధిష్ఠానం ఉన్నట్టు తెలుస్తున్నది. మొత్తంమీద తాజా ప్రతిపాదన అంశం ప్రచారంలోకి రావడంతో ఆ సీట్లపై ఆశలు పెట్టుకున్న టీడీపీ నేతలు కౌంటర్ ఎటాక్‌కు సిద్ధం కావడంతో ఉత్కంఠ రాజకీయాలు నెలకొన్నాయి.



అమలాపురంలో టీడీపీ లోక్‌సభ ఇన్‌చార్జి హరీష్‌మాధుర్ ఆధ్వర్యంలో ఏర్పాటైన అన్న క్యాంటీనులో భోజనం కోసం క్యూ కట్టిన పేదలు

అన్నదాతా సుఖీభవ

- అమలాపురంలో అన్న క్యాంటీన్‌కు 500 రోజులు
- ఇప్పటి వరకు లక్ష మందికి పైగా భోజనాలు
- హరీష్‌మాధుర్ చేయూతతో సాగుతున్న క్యాంటీన్

(అమలాపురం-ఆంధ్రజ్యోతి)

పేద ప్రజలకు పట్టెడన్నం పెట్టాలనే లక్ష్యంతో టీడీపీ జాతీయ అధ్యక్షుడు నారా చంద్రబాబునాయుడు గత ప్రభుత్వ హయాంలో ప్రవేశపెట్టిన అన్న క్యాంటీన్ పథకాన్ని టీడీపీ పార్లమెంటు ఇన్‌చార్జి గంటి హరీష్‌మాధుర్ అమలాపురం కేంద్రంగా సమర్థవంతంగా అమలు చేస్తున్నారు. పేదలకు అన్న క్యాంటీన్ ద్వారా నిత్యం అన్నదానం చేస్తూ వారి ఆకలి తీర్చేందుకు అమలాపురం పట్టణంలోని మెయిన్‌రోడ్డులో పెద్ద మసీదు పక్కన ఏర్పాటు చేశారు. సోమవారం నాటికి ఈ క్యాంటీను ఏర్పాటై 500 రోజులు పూర్తయిన సందర్భంగా హరీష్‌మాధుర్ ఆధ్వర్యంలో ఆ పార్టీ శ్రేణులు వేడుకలు జరుపుకునేందుకు సిద్ధమవుతున్నారు. ఇప్పటివరకు సుమారు లక్ష మందికి పైగా భోజన సదుపాయం కల్పించారు. ప్రతి పేదవాడికి బియ్యం సరఫరా చేయాలనే తపనతో ఎన్టీ రామారావు కిలో రూ.2కే బియ్యం పథకాన్ని ప్రవేశపెట్టారు. అదే స్ఫూర్తితో టీడీపీ అధినేత చంద్రబాబునాయుడు రూ.5కే పేద ప్రజలకు కడుపునిండా భోజనం పెట్టి వారి ఆకలి తీర్చాలనే లక్ష్యంతో అన్న క్యాంటీన్లను సమర్థవంతంగా గత ప్రభుత్వ హయాంలో నిర్వహించారు. అయితే జగన్ ప్రభుత్వం అన్న క్యాంటీన్లను కుట్రపూరితంగా తొలగించింది. కొన్నింటిని కూల్చేసింది. మరికొన్నిటిలో ప్రభుత్వ కార్యాలయాలను ఏర్పాటు చేసింది. అయితే అన్న క్యాంటీను వల్ల పేదలకు జరుగుతున్న మేలును చూసిన లోక్‌సభ దివంగత స్పీకర్ జీఎంసీ బాలయోగి తనయుడైన హరీష్‌మాధుర్ తండ్రి ఆశయాల అమలులో భాగంగా బాలయోగి పుట్టినరోజైన 2022 అక్టోబరు 1న క్యాంటీను ఏర్పాటు చేశారు. నాటి నుంచి నేటి వరకు ప్రతిరోజు పేదలకు రూ.5కే మధ్యాహ్న భోజనం అందిస్తున్నారు. ఇందుకోసం నిత్యం పెద్ద సంఖ్యలో ప్రజలు అక్కడకు చేరుకుని క్యూలు కడుతున్నారు. షడ్రుచోపేతంగా పెట్టే భోజనాన్ని తింటున్నారు. పేదల ఆకలి తీర్చేందుకు 500 రోజులుగా అన్న క్యాంటీను పేరుతో నిత్యం భోజనాలు పెడుతూ సేవలు అందిస్తున్న లోక్‌సభ టీడీపీ ఇన్‌చార్జి హరీష్‌మాధుర్ సేవలను అటు పేద ప్రజలు, ఇటు టీడీపీ నేతలు కొనియాడుతున్నారు. 500 రోజులు పూర్తయిన సందర్భంగా సోమవారం పేద ప్రజల సమక్షంలో కేక్ కట్‌చేసి వారితో ఈ వేడుకను పంచుకోవడం తనకెంతో ఆనందంగా ఉందని హరీష్‌మాధుర్ పేర్కొన్నారు. తన తండ్రి ఆశయాల కొనసాగింపులో భాగంగా చేపడుతున్న సేవా కార్యక్రమాలు తనకు సంతృప్తినిచ్చాయని ఆయన పేర్కొన్నారు. ఇప్పటి వరకు సహకరించిన టీడీపీ నాయకులు, కార్యకర్తలకు, పేదలకు ఆయన ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

ఆదిలోనే అవాంతరం!

- విశ్వకర్మ పథకం కోసం లబ్ధిదారులకు ఇక్కట్లు..
- సర్వర్లు పనిచేయక నమోదులో జాప్యం
- పట్టించుకోని సచివాలయ సిబ్బంది
- అవగాహన కల్పించడంలో అధికారుల వైఫల్యం

కాట్రేనికోన, ఫిబ్రవరి 11: జగన్ ప్రభుత్వం స్వయం ఉపాధి పథకాలను నిలిపివేసింది. దీంతో గ్రామాల్లో నిరుపేదలు... ముఖ్యంగా మహిళలు ఉపాధి లేక ఆర్థిక ఇబ్బందులతో సతమతమవుతున్నారు. కుటుంబాల పోషణ భారమై దిక్కుతోచక అల్లాడుతున్నారు. చేతివృత్తులు, సంప్రదాయ వృత్తుల వారికి ప్రధానమంత్రి విశ్వకర్మ యోజన పథకం కొండంత అండగా నిలిచింది. ఈ పథకంలో ఎంపికైన వారికి ప్రత్యేక శిక్షణ ఇచ్చి, శిక్షణ పరికరాలకు రూ.15వేలు మంజూరు చేస్తారు. అనంతరం మొదటిసారిగా లక్ష రూపాయలు, రెండో దఫా మరో లక్ష రూపాయలు బ్యాంకుల ద్వారా రుణం ఇస్తారు. ఈ రుణంపై ఐదు శాతం నామమాత్రపు వడ్డీ విధిస్తారు. సంప్రదాయక పనిముట్లు ఉపయోగించే కళాకారులు, చేనేత, వృత్తి కార్మికులు, వడ్రంగి, స్వర్ణకారులు, కమ్మరి, కుమ్మరి, శిల్పులు, చెప్పులు కుట్టేవారు, తాపీ కార్మికులు,



మేదర్లు, చేపల వలల తయారీదారులు ఈ పథకం పరిధిలోకి వస్తారు. దీనికి మంచి ఆదరణ లభిస్తోంది. చేతివృత్తుల వారు దరఖాస్తు చేసుకునేందుకు ఎగబడుతున్నారు. ముఖ్యంగా మహిళలు కుట్టుమిషన్ల కోసం దరఖాస్తు చేసుకునేందుకు కామన్ సర్వీస్ సెంటర్ల ముందు బారులు తీరుతున్నారు. అయితే ఇక్కడే వారికి నానా అడ్డంకులు ఎదురవుతున్నాయి. సర్వర్లు బిజీ కావడంతో దరఖాస్తు చేయడానికి రోజుల తరబడి సెంటర్లకు పరుగెత్తాల్సి వస్తోంది. ఈ పథకం పట్ల, దరఖాస్తుల అప్‌లోడ్ పట్ల అధికారులు సరైన అవగాహన కల్పించకపోవడంతో లబ్ధిదారులకు ఆదిలోనే తిప్పలు తప్పట్లేదు. కేంద్రం సూక్ష్మ, చిన్న, మధ్య తరహా సంస్థల శాఖ ద్వారా ఈ పథకాన్ని అమలు చేస్తోంది. ఈ రుణాలకు ఎవరు అర్హులో తెలియని అయోమయ పరిస్థితి నెలకొంది. వేల సంఖ్యలో గ్రామాల్లో మహిళలు కుట్టుమిషన్ల కోసం దరఖాస్తు చేసుకుంటున్నారు. అయితే వీరిలో ఎంతమందికి రుణం అందుతుందో తెలియదు. కామన్ సెంటర్లలో దరఖాస్తుల ప్రక్రియ చివరి దశలో నిలిచిపోతోంది. దరఖాస్తు నమోదై ప్రింట్ బయటకు రాకపోవడంతో రిజిస్టర్ నెంబరుతో మహిళలు గ్రామ సచివాలయాలకు వెళ్తున్నారు. సచివాలయ సిబ్బంది వీరిని పట్టించుకోకపోవడంతో నిరాశతో వెనుదిరుగుతున్నారు. కనీసం సైట్లో సాంకేతిక లోపాలు సరిచేసే పరిస్థితి లేదు. టోల్‌ఫ్రీ సౌకర్యం లేదు. సమస్యలు, తప్పులు, సందేహాలపై ఎవరిని సంప్రదించాలో తెలియని పరిస్థితి. విశ్వకర్మ పథకం అర్హులకు అందాలంటే అవగాహన సదస్సులు నిర్వహించాలి. దరఖాస్తుల నమోదుకు సహాయక చర్యలు చేపట్టాలి. సర్వర్ల సామర్థ్యాన్ని పెంచాలి. అప్పుడే ఈ పథకం గ్రామీణ వృత్తుల కుటుంబాలకు కొండంత అండగా నిలిచి వారి కుటుంబాల్లో ఆనందజ్యోతి వెలిగిస్తుంది.



అంగన్‌వాడీల విజయోత్సవ సభలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ ఐవీ

అంగన్‌వాడీల పోరాట స్ఫూర్తి

అభినందనీయం

పీడీఎఫ్ ఎమ్మెల్సీ యిళ్ల వెంకటేశ్వరరావు

అమలాపురం రూరల్, ఫిబ్రవరి 11: అంగన్‌వాడీలు అలుపెరగకుండా చేసిన పోరాట స్ఫూర్తి అభినందనీయమని పీడీఎఫ్ ఎమ్మెల్సీ యిళ్ల వెంకటేశ్వరరావు (ఐవీ) పేర్కొన్నారు. అంగన్‌వాడీలను ఎస్మా చట్టం పరిధిలోకి తీసుకువస్తూ జగన్ ప్రభుత్వం జీవో తీసుకురావడం ప్రభుత్వ దుర్మార్గానికి నిదర్శనమన్నారు. ఈదరపల్లిలోని అంబేద్కర్ కమ్యూనిటీ హాలులో బండి వెంకటలక్ష్మి అధ్యక్షతన జిల్లా స్థాయి అంగన్‌వాడీల విజయోత్సవ సభ నిర్వహించారు. ఎమ్మెల్సీతో పాటు అంగన్‌వాడీల సంఘ రాష్ట్ర అధ్యక్షురాలు జి.బేబీరాణి, కేవీపీఎస్ రాష్ట్ర కార్యదర్శి ఆండ్ర మాల్యాద్రి, వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు కారెం వెంకటేశ్వరరావు, సీఐటీయూ జిల్లా కార్యదర్శి గుడే దుర్గాప్రసాద్, సంఘ జిల్లా ప్రధాన కార్యదర్శి కె.కృష్ణవేణి, యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు పెంకే వెంకటేశ్వరరావు హాజరై మాట్లాడారు. 42 రోజుల పాటు జరిగిన సమ్మెలో అంగన్‌వాడీలు అంతా నూరుశాతం పాల్గొనడం గొప్ప విషయమన్నారు. అంగన్‌వాడీలు సమ్మె చేస్తే స్పందించని పాలకుడిగా సీఎం జగన్ చరిత్రలో నిలిచిపోయారన్నారు. ఒక్కో అంగన్‌వాడీకి రోజుకు రూ.200పైగా ఖర్చు అవుతున్నా వెనుకాడకుండా అప్పులు చేసి మరీ సమ్మెలో పాల్గొనడం అభినందనీయమన్నారు. సమ్మెకు సహకరించిన అందరికీ కృతజ్ఞతలు తెలిపారు. ఐద్వా నాయకురాలు టి.నాగవరలక్ష్మి, ప్రాజెక్టు, సెక్టార్ నాయకులు ఎం.దుర్గమ్మ, పి.అమూల్య, కె.బేబిగంగారత్నం, విజయలక్ష్మి, సుజాత, రాణి, కె.వెంకటలక్ష్మి, మహేశ్వరి, సుధారాణి, జి.కమల, సూర్యకళ, రత్నకుమారి, సూర్యకుమారిలతో పాటు వందలాది మంది అంగన్‌వాడీలు విజయోత్సవ సభలో పాల్గొన్నారు.



భారీ టేకు చేప

అల్లవరం, ఫిబ్రవరి 11: మండలంలోని ఓడలరేవు సముద్ర జలాల్లో బోటు వలల్లో టేకు చేపలు పడుతున్నాయి. ఉప్పాడకు చెందిన ఓసుబిల్లి నాగు ఓడలరేవు నుంచి బోటులో వేటకు వెళ్లగా ఇతర చేపలతో పాటు 20 కిలోల భారీ టేకు చేప చిక్కింది. ఓడలరేవులో కొందరు దీనిని కొనుగోలు చేశారు.



కుటుంబ సభ్యులతో శ్రీను

జైలు నుంచి ఇంటికి కోడికత్తి శ్రీను

- 7లో

విషాద యాత్ర

- సీతపల్లి వాగులో పడి ముగ్గురు విద్యార్థుల మృతి
- రంపయర్రంపాలెంలో విషాదచాయలు

వివరాలు 7లో

జైలు నుంచి ఇంటికి..

● ఐదేళ్ల తరువాత ఇంటికి చేరిన కోడి కత్తి శ్రీను

ముమ్మిడివరం, ఫిబ్రవరి 11: కోడి కత్తి కేసులో నిందితుడు జనిపల్లి శ్రీనివాసరావుకి హైకోర్టులో బెయిల్ లభించడంతో ఆదివారం స్వగ్రామం డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా ముమ్మిడివరం మండలం ఠాణేలంక పెదపేటలోని తమ నివాస గృహానికి చేరుకున్నాడు. బెయిల్ రావడం చాలా ఆనందంగా ఉందని జనిపల్లి శ్రీనివాసరావు ఈసందర్భంగా పేర్కొన్నారు. జైల్లో తాను డిగ్రీ పూర్తి చేశానని, లా చదవాలనుకున్నాను. అయితే అందుబాటులో లేకపోవడంతో బీఏ డిగ్రీ పూర్తిచేసి ఎంఏ సోషియాలజీ చదువుతున్నాను. సమాజంలో మంచి కోసం పోరాటం చేసేందుకు సోషియాలజీని చదువుతున్నట్టు శ్రీనివాసరావు పేర్కొన్నారు. జైల్ సూపరింటెండెంట్ రాజారావు, జైలర్ కుమారస్వామి, అంబేడ్కర్ యూనివర్శిటీ లెక్చరర్ అనంతలక్ష్మిలు తాను చదవడానికి ఎంతో తోడ్పాటును ఇచ్చారన్నారు. ఖైదీల హక్కుల సంక్షేమ సంఘం, సమతా సైనిక్‌దళ్‌వారు పోరాటం, న్యాయవాది సలీమ్ కృషివల్ల తనకు బెయిల్ లభించిందన్నారు.


న్యాయవాది సలీమ్‌తో పోలీసుస్టేషన్‌కు హాజరవుతున్న శ్రీనివాసరావు

న్యాయవాది కృషి ఫలితమే : తల్లిదండ్రులు సావిత్రి, తాతారావు

కుమారుడు శ్రీనివాసరావు బెయిల్‌పై ఇంటికి రావడం చాలా ఆనందంగా ఉందని తండ్రి తాతారావు, తల్లి సావిత్రి పేర్కొన్నారు. శ్రీనివాసరావు జైల్లో ఉన్నప్పుడు తమ న్యాయవాది సలీమ్ ఎంతో ఆదరించి అండగా నిలబడ్డారన్నారు. విజయవాడలో నాలుగు ప్రజా సంఘాలు చేసిన పోరాటానికి న్యాయవాది కృషి ఫలితంగా కుమారుడికి బెయిల్ వచ్చిందని, లేకపోతే వచ్చి ఉండేది కాదన్నారు. న్యాయవాది సలీమ్, ప్రజా సంఘాలకు తమ కుటుంబం చాలా రుణపడి ఉంటామన్నారు.

బాహుబలి-2 ముందుంది : న్యాయవాది సలీమ్

ఈ కేసులో ఐదు సంవత్సరాలు ప్రయాణం చేశారు. శ్రీనివాసరావు కుటుంబంతో ఎంతో అనుబంధం ఏర్పడింది. శ్రీనివాసరావు తల్లి సావిత్రి నా సలీమ్ అని పలకరించడం ఎంతో ఆనందాన్నిచ్చింది. వ్యవస్థ ఒక అమాయకుడి పట్ల ఎలా మిస్‌చీఫ్ చేసిందో ఈ కేసులో తెలిసింది. తెలుగుదేశం, వైసీపీల మధ్య రాజకీయాలు శ్రీనివాసరావును బలి పశువును చేశాయి. ఫలితంగా ఐదు సంవత్సరాల జీవిత కాలాన్ని ఒక దళిత యువకుడు కోల్పోవాల్సి వచ్చిందన్నారు. కేసులో బాధితుడు ముఖ్యమంత్రి కావడం వల్లనే దీనిపై కీలక ప్రభావం చూపించిందని, లేదంటే ఎప్పుడో బెయిల్ వచ్చేదన్నారు. కేసు కూడా తేలిపోయి ఉండేదని అభిప్రాయ పడ్డాడు. ఈ కేసు వాదించేందుకు న్యాయవాదులెవరూ ముందుకు రాలేదు. ఎన్నో ఒత్తిళ్లు ఎదురైనా తానే కేసును వాదించానని శ్రీనివాసరావు కుటుంబాన్ని సొంత కుటుంబంగా భావిస్తున్నానన్నారు. శ్రీనివాసరావు 5వేల పుస్తకాలు జైల్లో చదివాడని, సమాజంలో మంచి కోసం పోరాటం చేస్తానని, అందుకు నా సహకారం కూడా కావాలన్నారు. ఈ కేసులో సీఎం జగన్ మనసులేని వ్యక్తిగా ప్రవర్తించారని, విజయవాడలో 125 అడుగుల అంబేడ్కర్ విగ్రహాన్ని ఏర్పాటుచేసిన జగన్ ఆయన వారసులైన శ్రీనివాసరావు కుటుంబ సభ్యులపట్ల మనసు లేకుండా ప్రవర్తించారన్నారు. సీఎం ఎన్‌వోసీ ఇచ్చినా, కోర్టుకు హాజరై సాక్ష్యం చెప్పినా ఇంత సమయం వృథా అయ్యేది కాదన్నారు. బాహుబలి-2లో కట్టప్పను బయటకు లాగుతాం. ఎవరి హస్తం ఉందో తేల్చి శ్రీనివాసరావుపైన పడిన మచ్చను కడిగేస్తామన్నారు.

లోవ క్షేత్రంలో భక్తుల కోలాహలం

● రూ.3.65లక్షల ఆదాయం



తుని రూరల్, ఫిబ్రవరి 11: లోవదేవస్థానం ఆదివారం భక్తులతో కోలాహలంగా మారింది. అమ్మవారి దర్శనార్థం తెలుగురాష్ట్రాల నలుమూలల నుంచి పెద్దఎత్తున తరలివచ్చిన భక్తులతో ఆలయ ప్రాంగణం కిక్కిరిసింది. వేకువజామున అమ్మవారిని సర్వాంగ సుందరంగా అలంకరించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. క్యూలైన్‌లో బారులు తీరిన భక్తులు అమ్మవారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. భక్తుల సౌకర్యార్థం ఆలయ ఈవోవిశ్వనాథ రాజు ప్రత్యేక ఏర్పాట్లుచేసి తీర్థప్రసాదాలు అందజేశారు. ఆలయానికి తరలివచ్చిన భక్తులతో వివిధ విభాగాల ద్వారా రూ.3.65లక్షల ఆదాయం సమకూరినట్లు ఈవో తెలిపారు.

విషాద యాత్ర


విద్యార్థులను మింగేసిన సీతపల్లి వాగు

● సీతపల్లి వాగులో పడి ముగ్గురు విద్యార్థుల మృతి

● రంపయర్రంపాలెంలో విషాదఛాయలు


మృతులు కాకర వీరవెంకటఅర్జున్, అండిబోయిన దేవిచరణ్, లావేటి రామన్‌జీ

గోకవరం, ఫిబ్రవరి 11: విహారయాత్ర విషాదంగా మారింది. రాజమహేంద్రవరం-భద్రాచలం హైవేపై అల్లూరి జిల్లాలో రంపచోడవరం మండలం ఐ.పోలవరం సమీపంలోని సీతపల్లి వాగులో పడి రంపయర్రంపాలెం గ్రామానికి చెందిన ముగ్గురు విద్యార్థులు మృతి చెందారు. కన్నవారికి తీవ్ర శోకాన్ని మిగిల్చారు. వివరాల్లోకి వెళితే.. తూర్పుగోదావరిజిల్లా గోకవరం మండలం రంపయర్రంపాలెం గ్రామానికి చెందిన కాకర వీరవెంకటఅర్జున్(15), అండిబోయిన దేవిచరణ్(15), లావేటి రామన్‌జీ(15), తోపాటు మరో ఇద్దరు విద్యార్థులు రంపయర్రంపాలెంలోని ప్రభుత్వ జడ్పీ ఉన్నత పాఠశాలలో పదో తరగతి చదువుతున్నారు. ఈ ఐదుగురు రెండు మోటారు సైకిళ్లపై విహారయాత్రకంటూ ఆదివారం మధ్యాహ్నం 12:30 గంటల సమయంలో రంపచోడవరం మండలంలోని ఐ.పోలవరం గ్రామ సమీపంలో ఉన్న సీతపల్లి వాగు వద్దకు వెళ్లారు. వాగు వద్ద కాసేపు సెల్‌ఫోన్లతో ఫొటోలు దిగారు. 3-4గంటల మధ్య అర్జున్, దేవిచరణ్, రామన్‌జీ స్నానం చేసేందుకు వాగులోకి దిగారు. కొద్దిసేపటికి వారి జాడ కనిపించకపోవడంతో గట్టున ఉన్న ఇద్దరు గట్టిగా కేకలు వేయడంతో అక్కడే ఉన్న రంపయర్రంపాలేనికి చెందిన మరికొందరు పర్యాటకులు విషయం తెలుసుకొని వారికోసం వెతకడం ప్రారంభించారు. సమీపంలో ఉన్న ఈతగాళ్లు వాగులోకి దిగి గాలించగా ముగ్గురి మృతదేహాలు బయటపడ్డాయి. విషయం తెలుసుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం రంపచోడవరం ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

● గ్రామంలో విషాద ఛాయలు: విహారయాత్రకు వెళ్లిన ఒకే గ్రామానికి చెందిన ముగ్గురు విద్యార్థులు సీతపల్లివాగులో పడి మృతి చెందడంతో రంపయర్రంపాలెంలో విషాదఛాయలు అలుముకున్నాయి. మధ్యాహ్నం వరకు కళ్ల ముందే కలియదిరిగిన ముగ్గురు విద్యార్థులు వాగులో పడి మృతి చెందారన్న విషాదవార్తను గ్రామస్థులను కలిచివేసింది. గ్రామస్థులంతా విషాదంలో మునిగిపోయారు. గ్రామస్థుల్లో చాలామంది విద్యార్థుల మృతదేహాలను చూసేందుకు రంపచోడవరం ప్రభుత్వాసుపత్రి వద్దకు వెళ్లారు.

● తీవ్ర శోకాన్ని మిగిల్చారు: మనం తిన్నా తినకపోయిన పదో తరగతి వరకు చదివించాం. ఇంకో రెండు, మూడేళ్లు ఏదో రకంగా కష్టపడి చదివిస్తే మనకు అండగా ఉంటారనుకున్నామని, ఇంతలోనే తమ ఆశలపై నీళ్లు చల్లి తీవ్ర శోకాన్ని మిగిల్చారంటూ మృతుల తల్లిదండ్రులు విలపిస్తున్న తీరు చూపరులను కలిచివేసింది. కాగా అర్జున్ తండ్రి కాకార విష్ణు రేషన్‌షాపు డీలర్. దానిపైన వచ్చే ఆదాయంతోనే కుటుంబ పోషణ జరుగుతోంది. దేవిచరణ్ తండ్రి అండుబోయిన అప్పారావు వ్యవసాయ కూలి. ఏపూటకాపూట కూలిపనికి వెళ్తేనే గాని జీవనం సాగదు. రామన్‌జీ తండ్రి సత్తిబాబు కూడా వ్యవసాయ కూలీనే. ఇతను కూడా పనికి వెళ్తేనే ఆ కుటుంబంలోని అందరు కడుపులు నిండుతాయి.

(రంపచోడవరం)

ఆల్లూరి జిల్లాలో పలు విహార కేంద్రాలు మృత్యుకుహారాలుగా మారి పలు కుటుంబాలలో విషాదాన్ని మిగుల్చుతున్నాయి. ముఖ్యంగా పాపికొండలు, కొండ వాగులు, జలపాతాలు, ప్రమాదకరమైన గిరి ప్రాంతాలు ఇలా మన్యం నలుమూలలగా విస్తరించిన విహార క్షేత్రాలలో ఎక్కడా కూడా సరైన రక్షణ చర్యలు లేకపోవడమే ప్రమాదాలకు మూలమవుతోంది. కొండవాగులలో చోటు చేసుకుంటున్న ఇసుక అక్రమ తవ్వకం వంటి మానవ తప్పిదాలు కూడా ఆయా కేంద్రాలను ప్రాణాపాయ కేంద్రాలుగా మార్చేశాయి. ఆదివారం భద్రాచలం హైవేపై అల్లూరి జిల్లా రంపచోడవరం మండలం ఐ.పోలవరం సమీపాన ఉన్న సీతపల్లి వాగు పర్యాటక కేంద్రంలో చోటు చేసుకున్న ముగ్గురు విద్యార్థులను బలితీసుకున్న ప్రమాద ఘటన ఇందుకు అద్దం పడుతోంది. గత నెలలో ఇదే ప్రాంతంలో ఇద్దరు సీతపల్లి వాగులో దిగి మృత్యువాత పడ్డారు. ఈ ప్రమాద ఘటనా ప్రాంతాన్ని, దాని పరిసరాలను పరిశీలిస్తే అక్కడ చోటుచేసుకున్న అనేక మానవ తప్పిదాలు, ఇవి తెలిసీ కూడా వాటిని నిరోధించాల్సిన వ్యవస్థల నిర్లక్ష్యం తరచు ప్రమాదాలకు కారణమవుతోంది. ఇక్కడ వాగును అక్రమంగా ఇసుక త్రవ్వకాల కోసం వాడుకోవడం, వాగు ప్రాంతం ఇసుక త్రవ్వకాలతో లోతుగా ప్రమాదకరంగా మారడం, ఇది తెలియని పర్యాటకులు వాగులో దిగి మృత్యువాత పడటం ప్రహసనంగా మారింది. ఈ పర్యాటక కేంద్రంలో ప్రభుత్వపరంగా సరైన రక్షణ చర్యలు కానీ, వాగు వద్ద పర్యాటకులను వారించే వ్యవస్థలు, వ్యక్తులూ లేకపోవడంతో పర్యాటకుల విచ్చలవిడి విహారానికి అడ్డూ అదుపూ లేకుండా పోతోంది. ఈ వాగు ఇప్పటికే ఎన్నో ప్రాణాలను బలితీసుకున్నా, ఈ విషయాలను తెలిసి కూడా అక్కడ రక్షణ కంచెలను ఏర్పాటుచేసి పర్యాటకులను వాగులోకి దిగకుండా నిరోధించలేని నిర్లక్ష్యాలే ఈ ప్రమాదాలకు కారణమయ్యాయి.


సీతపల్లివాగులో గల్లంతైన విద్యార్థుల మృతదేహాలను వెలికితీస్తున్న దృశ్యం

ఊపిరి తీస్తున్న విహారం..

● విహార కేంద్రాల్లో లోపించిన రక్షణ చర్యలు

● పట్టించుకోని అధికార యంత్రాంగం

● చిన్నపాటి నిర్లక్ష్యమే ప్రమాదానికి కారణం

ఈ ఒక్క ప్రాంతమే కాదు మన్యం నలుమూలలుగా మోతుగూడెం, డొంకరాయి, పాపికొండలు, మారేడుమిల్లి, అడ్డతీగల, వైరామవరం తదితర మండలాలల్లో ఉండే ప్రమాదకర జలపాతాలూ, ఎత్తైన ప్రమాదకర కొండలు, గుడిసె క్షేత్రం వంటి ప్రాంతాలలో పోలీసు, రెవెన్యూ, అటవీశాఖలు పూర్తిగా విఫలమై ప్రమాదాలకు కారణమవుతున్నాయి. గతంలో పాపికొండలు ప్రాంతంలో చోటుచేసుకున్న బోటు ప్రమాదం ఎన్నో కుటుంబాలలో విషాదాన్ని నింపిన అనంతరం పాపికొండల విహారానికి ఎన్నో ఆంక్షలతో ప్రమాదాలు నిలువరించబడ్డాయి. కానీ ఇతర ప్రాంతాల విషయంలో కూడా ఈ ప్రమాదాలను ముందస్తుగా నిరోధించగల సత్తా ఉన్నా, ఆయా శాఖలు, అధికారులు పరోక్షంగా ప్రభుత్వానికి అనుకూలంగా ఉండే సంస్థలకు, వ్యక్తులకు ఆదాయాన్ని తెచ్చిపెడుతుండటంతో ఆయా అధికారులు సైతం తప్పనిసరి నిర్లక్ష్యాన్ని ప్రదర్శిస్తున్నాయి. మన్యంలో కేంద్ర సర్వీసులకు చెందిన ఉన్నతాధికారుల పర్యవేక్షణలోనే ఆయా శాఖలు పనిచేస్తున్నా ఇటువంటి ప్రమాదాలను నిరోధించే చర్యలను తీసుకోవడంలో వారిని నిరోధించే వ్యవస్థలదే పైచేయి కావడంతో అంతటి కేంద్ర సర్వీసుల ఉన్నతాధికారులు సైతం చోద్యమే చూస్తున్నారు. ఇకనైనా ప్రభుత్వం కేవలం ఆదాయమే ఆపేక్షగా కాకుండా కట్టుదిట్టమైన రక్షణ, భద్రతా చర్యలను చేపడితే ప్రమాదరహిత విహారం మన్యంలో శోభిల్లుతోంది.

సరాదా కోసం వెళ్లి తిరిగి రాని లోకాలకు..

● యర్రపోతవరం లాకుల వద్ద రోడ్డు ప్రమాదం

● ఇద్దరు యువకుల మృతి


యర్రపోతవరం లాకుల వద్ద రోడ్డుప్రమాదంలో మృతి చెందిన జానీ, ప్రసాద్

కె.గంగవరం/అనపర్తి, ఫిబ్రవరి 10: మండల పరిధిలోని యర్రపోతవరం లాకుల వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు యువకులు అక్కడికక్కడే మృతి చెందారు. పామర్రు ఎస్.ఐ. జానీ బాషా తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. తూర్పుగోదావరి జిల్లా అనపర్తి మండలం అనపర్తి సావరంకు చెందిన దుర్గాడ జానీ(26), లక్ష్మీనరసాపురంకు చెందిన పిల్లి ప్రసాద్(28)లు మరో ఇద్దరు స్నేహితులతో కలసి ఆదివారం ఉదయం యానాం వెళ్ళారు. అక్కడ పని ముగించుకుని తిరిగి యానాం నుంచి అనపర్తి వెళుతున్న సందర్భంలో యర్రపోతవరం లాకుల వద్ద ఎదురుగా వస్తున్న లారీని ఢీ కొట్టారు. ఈ ప్రమాదంలో జానీ, ప్రసాద్‌లు అక్కడికక్కడే మృతి చెందారు. రామచంద్రపురం డీఎస్పీ బి.రామకృష్ణ, సి.ఐ. పి.దొరరాజు సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు చెప్పారు. మరణించిన ప్రసాద్, జానీ మృతదేహాలను పోస్టుమార్టంకు తరలించినట్లు చెప్పారు. ప్రసాద్, జానీ మరణంతో రెండు కుటుంబాలు వారు కుటుంబ పెద్దలను కోల్పోయారు. వీరిలో జానీకి చదువుకుంటున్న తమ్ముడు, ప్రసాద్‌కు పెళ్లీడుకు వచ్చిన చెల్లెలు ఉన్నారు. వీరి మరణంతో అనపర్తి సావరం, లక్ష్మీనరసాపురం గ్రామాల్లో విషాదం అలుముకుంది.

రెండు కుటుంబాల్లో విషాదం

ఆదివారం పనికి సెలవు కావడంతో స్నేహితులు సరదాగా గడిపేందుకు యానాం వెళ్లి తిరుగు ప్రయాణంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో ప్రాణాలు కోల్పోయారు. చేతికందిన కొడుకులు ప్రాణాలు కోల్పోవడంతో రెండు కుటుంబాలలోను విషాద ఛాయలు అలుముకున్నాయి. అనపర్తి మండలం లక్ష్మీనరసాపురానికి చెందిన పిల్లి ప్రసాద్(26), అనపర్తి సావరంనకు చెందిన దుర్గాడ జానీ(28) స్నేహితులు. ఇద్దరూ అవివాహితులే.. తాపీ పనిచేసుకుంటూ కుటుంబాలను పోషించుకుంటున్నారు. ఇద్దరికీ తండ్రులు లేకపోవడంతో రెండు కుటుంబాలకు వారే ఆధారం కావడంతో రెండు కుటుంబాల వారు అనాథలుగా మిగిలారు. ఆదివారం తాపీ పనికి సెలవు కావడంతో ఇద్దరూ మోటారుసైకిల్‌పై యానాం వెళ్లి సరదాగా గడిపారు. తిరుగు ప్రయాణంలో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమజిల్లా కె.గంగవరం మండలం ఎర్రపోతవరం లాకులవద్దకు చేరుకునే మోటార్‌సైకిల్.. లారీని ఢీకొట్టడంతో ఇద్దరూ అక్కడికక్కడే మృతి చెందారు. భర్తలు లేరు.. కడవరకు తమను చూసుకుంటారని గంపెడు ఆశలు పెట్టుకున్న ఆ తల్లులు.. కుమారులు అర్థాంతరంగా తమను విడిచి వెళ్లిపోవడంతో కన్నీరుమున్నీరవుతున్నారు. ఇద్దరు యువకుల మృతితో రెండు గ్రామా ల్లోనూ విషాదఛాయలు అలుముకున్నాయి.

సత్యదేవుడి సన్నిధిలో

ప్రారంభమైన మాఘమాసపు రద్దీ

● రూ.40 లక్షల ఆదాయం



అన్నవరం, ఫిబ్రవరి 11: ప్రముఖ పుణ్యక్షేత్రమైన సత్యదేవుడి సన్నిధిలో మాఘమాసపు రద్దీ ప్రారంభమైంది. గతనెల రోజులుగా పుష్యమాసం శూన్యమాసం కావడంతో శుభకార్యక్రమాలు లేక అలయంలో సాధారణ రద్దీ మాత్రమే ఉండేది. వివాహాలు సీజన్ ప్రారంభంకావడం ఆదివారం సెలవుదినం కావడంతో వివిధ ప్రాంతాల నుంచి భక్తులు స్వామివారి దర్శనానికి విచ్చేశారు. భక్తులు అధికసమయం వేచి ఉంచకుండా ఈవో రామచంద్రమోహన్ ఆదేశాలతో సిబ్బంది చర్యలు తీసుకున్నారు. అంత్రాలయ ప్రదక్షణ దర్శనం టిక్కెట్లను కొద్దిసేపు నిలుపుదల చేశారు. ఆదివారం ఒక్కరోజు వివిధ విభాగాల ద్వారా సుమారు రూ.40 లక్షల ఆదాయం సమకూరింది.

సూర్యభగవానుడికి ప్రత్యేకపూజలు

మాఘపు ఆదివారం పురస్కరించుకుని కళామందిరంలో రుత్విక్‌లు ప్రత్యేకపూజలు నిర్వహించారు. ఉదయం 9గంటలకు సూర్యనమస్కారములు కార్యక్రమం నిర్వహించారు. వివిధ ఆసనాలతో ఆరోగ్యప్రదాత అయిన సూర్యభగవానుడిని ఆవాహన చేయించి క్షీరాన్నం నివేదించి భక్తులకు పంపిణీ చేశారు.

వైభవంగా భావనారాయణస్వామి తిరునాళ్లు



సర్పవరం జంక్షన్, ఫిబ్రవరి 11 : ఉమ్మడి జిల్లాలోనే సుప్రసిద్ధ పుణ్యక్షేత్రంగా విరాజిల్లుతోన్న సర్పవరం శ్రీరాజ్యలక్ష్మి సమేత శ్రీభావనారాయణ స్వామి తిరునాళ్లు వైభవంగా నిర్వహించారు. మాఘ మాసోత్సవాల్లో భాగంగా తిరునాళ్లను పురస్కరించుకుని స్వామివారిని దర్శించుకునేందుకు ఉమ్మడిజిల్లా నలుమూలల నుంచే కాకుండా ఇతర జిల్లాల నుంచి వేలాదిమంది భక్తులు పోటెత్తారు. మాఘమాసంలో వచ్చిన తొలి ఆదివారం తెల్లవారుజామునే భక్తులు ఆలయానికి చేరుకుని భక్తి శ్రద్ధలతో ముక్తికా సరస్సులో పుణ్యస్నానాలాచరించారు. ముందుగా భక్తులు భావనారాయణస్వామిని దర్శించుకున్న తర్వాత ఈశాన్య దిక్కున ఉన్న లక్ష్మీదేవి, ఆగ్నేయంలో ఆదిశేష భావనారాయణస్వామిని దర్శించుకుని పూజలు, అభిషేకాలు నిర్వహించారు. మహిళా భక్తులు ఆలయ ప్రాంగణంలో సూర్యభగవానుడికి ఎంతో ప్రీతిపాత్రమైన పాలపొంగులను ఆవు పిడకల పొయ్యిలపై తయారు చేసి భక్తితో స్వామి వారికి పాలపొంగులు, మొలకెత్తిన పెసలు, రేగుపళ్లు, చెరకు ముక్కలు, అరటి పండ్లను నివేదిస్తూ ఆకాశంలోకి ఎగురవేశారు. వీటిని భక్తులు కొంగులతో ఒడిసిపట్టుకుని ప్రసాదాన్ని స్వీకరించారు. స్వామివారిని దర్శించుకునేందుకు విచ్చేసిన భక్తులకు అవసరమైన అన్ని ఏర్పాట్లను ఆలయ ఛైర్మన్ పుల్ల నారాయణరావు, ఈవో జొన్నాడ భీమశంకరరావు ఆధ్వర్యంలో ఏర్పాటు చేశారు. సుమారు 15 వేల మంది భక్తులు స్వామివారిని దర్శించుకున్నట్లు ఈవో తెలిపారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

జగన్ మళ్లీ వస్తే బతకలేం


సింహగర్జన సభలో మాట్లాడుతున్న మాజీ ఎంపీ హర్షకుమార్

● దళితులను ఇంత నీచంగా చూసిన ముఖ్యమంత్రిని చూడలేదు ● దగా పడ్డ దళితుల ఆత్మగౌరవ పోరాటమే సింహగర్జన ● బీసీలకు తగ్గకుండా కాపుల రిజర్వేషన్లుకు మద్దతిస్తాం ● అమలాపురం మాజీ ఎంపీ హర్షకుమార్ ● వేమగిరిలో దళిత సింహ గర్జన సభ

రాజమహేంద్రవరం సిటీ/కడియం, ఫిబ్రవరి 11: రాష్ట్రంలో వైసీపీ పాలనలో దళితులు దగా పడ్డారని, వారి ఆత్మగౌరవ పోరాటమే ఈ సింహగర్జన సభ అని అమలాపురం మాజీ ఎంపీ జీవీ హర్షకుమార్ అన్నారు. రాజమహేంద్రవరం సమీపంలో వేమగిరి జాతీయ రహదారి వద్ద మైదానంలో ఆదివారం సాయంత్రం జగన్ ప్రభుత్వంపై యుద్ధం ప్రకటిస్తూ ఆయన దళిత సింహగర్జన సభను నిర్వహించారు. విజయనగరం నుంచి అనంతపురం వరకు, ఆంధ్రాతోపాటు తెలంగాణా రాష్ట్రం నుంచి దళితులు హాజరయ్యారు. తొలుత బీఆర్ అంబేడ్కర్, బాబూజగ్జీవనరామ్‌లకు నివాళులర్పించారు. అనంతరం హర్షకుమార్ మాట్లాడుతూ పోరాడితే పోయేది లేదు.. బానిస సంకెళ్లు తప్ప అన్నారు. రాష్ట్రంలో అధికారంలోకి రావడం కోసం జగన్ దళితులను నమ్మించారని, క్రైస్తవులు నమ్మి జగన్‌ను అధికారంలోకి తీసుకువచ్చారన్నారు. అయితే మణిపూర్‌లో క్రైస్తవులపై మారణ కాండ సృష్టిస్తే ఈ సీఎం కనీసం స్పందించలేదని, పైగా ఆనాడు అవిశ్వాసం పెడితే కేంద్ర ప్రభుత్వానికి ఈ వైసీపీ ఎంపీలు ఓటు వేశారని గుర్తు చేసారు. దేశంలో దళితులను ఇంత నీచంగా చూసిన జగన్ లాంటి ముఖ్యమంత్రిని ఎన్నడూ చూడలేదన్నారు. రాష్ట్రంలో బక్కి శ్రీను మొదలు డ్రైవరు సుబ్రహ్మణ్యం, డాక్టర్ సుధాకర్, గుంటూరులో రమ్య, అనంతపురంలో స్నేహలత, పులివెందులలో నాగమ్మ, కడపలో డాక్టర్, దొమ్మేరులో మహేంద్ర, నడింపల్లి రాము హత్యాకాండలు.. అలానే మైనింగ్‌ను ప్రశ్నించిన వరప్రసాద్ శిరోముండనం సంఘటన ఇలా చెపుతూ పోతే చాలా మంది దళితులు బలయ్యారన్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, కార్పొరేషన్‌లను నిర్వీర్యం చేశారని, దళితులకు సంబంధించిన 27 పథకాలను రద్దు చేశారని, పీజీ విద్యార్థులకు స్కాలర్‌షిప్‌లు, ఫీజు రీయింబర్స్‌మెంట్లు లేకుండా చేశారన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కలిసి దళితులకు దక్కాల్సిన రూ.75 లక్షల కోట్ల నిధులను దుర్వినియోగం చేశారని ఆరోపించారు. యాత్ర సినిమా చేసిన దర్శకునికి రెండెకరాల భూమి ఇచ్చిన ఈ ప్రభుత్వం బాధిత దళితులకు భూమిని కేటాయించలేకపోయిందని విమర్శించారు. అమ్మఒడి పథకానికి సబ్‌ప్లాన్ నిధులను ఖర్చుచేశారన్నారు. బేస్ ఎవలైబుల్ స్కీంను రద్దు చేసిందని, ఇంత మంచి స్కీంను తీసివేయడంపై సుప్రీంకోర్టు స్పందించి పునరుద్ధరించాలని చెప్పిందన్నారు. కులాంతర వివాహం స్కీంను జగన్ రద్దు చేశాడని గుర్తుచెశారు. ఎస్‌ఎస్‌సీ ఫైనాన్స్ కార్పొరేషన్ ద్వారా గతంలో కార్లు ఇచ్చేవారని అది లేదని, ఎస్సీ కార్పొరేషన్ ద్వారా రూ. లక్ష సబ్సిడీ వచ్చేదని అదీ రద్దు చేశాడని ధ్వజమెత్తారు. దళితులను దగా చేసిన ఈ ముఖ్యమంత్రి మళ్లీ వస్తే దళితులు బతకలేరని, అందుకే రాష్ట్రవ్యాప్తంగా ఉన్న దళితులంతా ఆత్మవిమర్శ చేసుకోవాలన్నారు. ఓటుకు రూ.10 వేలు ఇస్తే తీసుకోండి.. ఎందుకంటే అది ఇసుక, మద్యం, కొండలు దోచేసిన డబ్బే కదా... కాని జగన్‌కు ఓటు వేయొద్దన్నారు. జగన్‌ను దించే వరకు పోరాడదామని పిలుపునిచ్చారు. ఇక రాష్ట్రంలో బీసీలకు తగ్గించకుండా కాపులకు రిజర్వేషన్లు కల్పించే అంశంపై తమ పూర్తి మద్దతు ఉంటుందని ప్రకటించారు. తొలుత ఆలిండియా క్రిస్టియన్ ఫెడరేషన్ నేత జార్జి సీమంతుల మాట్లాడుతూ దళిత క్రైస్తవులకు ఎస్సీ హోదా కల్పించాలని హర్షకుమార్ డిమాండ్‌ను స్వాగతిస్తున్నామన్నారు. జగన్.. పాస్టర్లకు గౌరవ వేతనం అంటూ 29 వేల మందిని గుర్తించి కేవలం 8 వేల మందిని ఎంపిక చేశారన్నారు. క్రిస్టియన్ కార్పొరేషన్ అని పెట్టి చర్చిలు కడతామని మాట ఇచ్చి ఒమ్ము చేశారన్నారు. జంగా బాబూరావు మాట్లాడుతూ దళితులు తీవ్ర అన్యాయానికి గురయ్యారని, అభివృద్ధి కుంటుపడిందన్నారు. దళిత సత్తా అధ్యక్షుడు కామేశ్వరరావు మాట్లాడుతూ దళిత సైన్యం సిద్ధంగా ఉందని, జగన్ అంతం తప్పదని హెచ్చరించారు. ఈ సందర్భంగా బాధితులు బక్కి శ్రీను భార్య, నడింపల్లి గంగమ్మ తదితరులు తమకు జరిగిన అన్యాయాన్ని వివరించారు. జీవీ శ్రీరాజ్ మాట్లాడుతూ దళిత సింహగర్జన సభలో చర్చించిన అంశాలు, తీసుకున్న నిర్ణయాలపై అమరావతిలో ఓ సమావేశం పెడతామని అటుపై గ్రామగ్రామాన చైతన్య కార్యక్రమాలు చేపడుతున్నట్టు ప్రకటించారు. ఈ సభలో ఏలూరు మాలమహాసేన అధ్యక్షుడు రవికుమార్, బొజ్జా ఐశ్వర్య, నడింపల్లి గంగమ్మ, అయితాబత్తుల సుభాషిణి మాట్లాడారు. సభలో ఉభయ తెలుగురాష్ట్రాలకు చెందిన దళిత నాయకులు చిట్టిరాజు, హైదరబాదు గుడిమెళ్ళ వినోద్, కప్పల వెలుగు, శ్యాంబాబు, సింగపల్లి రమేష్, కోరుకొండ చిరంజీవి, తాళ్లూరి విజయ్‌కుమార్, గెడ్డం వెంకట్రాజు, ఇసుకపట్ల వెంకటరమణ, గెడ్డం శ్రీను, కరుణాకర్, శ్యాంసుందర్, విజయనగరం ఆదాల మోహన్, నిడదవోలు బండి శ్యామ్‌బాబు పాల్గొన్నారు.


తొండంగి నుంచి వచ్చి మాట్లాడుతున్న బాధితురాలు గంగ

కాలపరీక్షకు అందరూ నిలబడాల్సిందే

● ఆధ్యాత్మిక పీఠాధిపతి డాక్టర్ ఉమర్ ఆలీషా

పిఠాపురం, ఫిబ్రవరి 11: కాలపరీక్షకు అందరూ నిలబడాల్సిందేనని విశ్వవిజ్ఞాన విద్య ఆధ్యాత్మిక పీఠాధిపతి డాక్టర్ ఉమర్‌ఆలీషా అన్నారు. కాకినాడ జిల్లా పిఠాపురం పట్టణ శివారులోని నూతన ఆశ్రమ ప్రాంగణంలో మూడురోజులుగా జరుగుతున్న పీఠం వార్షిక మహాసభలు ఆదివారం సాయంత్రంతో ముగిశాయి. ఈ సందర్భంగా భక్తులనుద్దేశించి అనుగ్రహభాషణచేస్తూ మానవుడు తన జీవన పయనంలో ఎదురయ్యే కష్టనష్టాలు, దుఃఖాలు, తదితర కాలపరీక్షలను ఎదుర్కోవాలంటే ఆధ్యాత్మిక తాత్విక జ్ఞానాన్ని పెంపొందించుకోవాలన్నారు. కాలానికి అతీతంగా ప్రయాణించే జీవి ఏదీ సృష్టిలో లేదని చెప్పారు. తాత్వికులు, యోగులు అందరూ కాలగమనంతో ప్రయాణం చేసేవారేనని తెలిపారు. సభలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఆదికవి నన్నయ్య యూనివర్సిటీ వైస్‌చాన్సలర్ కె.పద్మరాజు మాట్లాడుతూ ఆధ్యాత్మిక తత్వప్రబోధం, సామాజిక సేవల ద్వారా విశ్వమానవ శ్రేయస్సు కోసం పీఠం చేస్తున్న కృషి అభినందనీయమన్నారు. గురువు ద్వారా పొందిన తాత్విక జ్ఞానాన్ని మరింతమందికి పంచాలని సూచించారు. అనంతరం ఉమర్‌ఆలీషా రూరల్ డెవలప్‌మెంట్ ట్రస్టు ద్వారా కుట్టుమిషన్లను మహిళలకు అందజేశారు. పీఠం ప్రచురించిన కరదీపికలు, గ్రంథాలను ఆవిష్కరించారు. కార్యక్రమాల్లో కాకినాడ ఎంపీ వంగా గీతావిశ్వనాథ్, అహ్మద్ ఆలీషా, సాహితీవేత్త జానకిరామచౌదరి, కాకినాడ మాజీ డిప్యూటీ మేయర్ అరిగెల బున్నీ, పీఠం కన్వీనర్ పేరూరి సూరిబాబు, ఆకుల రవితేజ పాల్గొన్నారు.


మహిళలకు కుట్టుమిషన్లు అందజేస్తున్న డాక్టర్ ఉమర్‌ఆలీషా, నన్నయ్య వీసీ పద్మరాజు

ఆకతాయిపై కేసు నమోదు

● బీరులో కల్తీ జరిగిందని వాదన

● ల్యాబ్ పరీక్షలో అతడే సిరా కలిపాడని నిర్ధారణ

కాకినాడ క్రైం, ఫిబ్రవరి 11: బీరు సీసాలో ఇంకు కలిపి పలువురు అధికారులను ఇబ్బంది పెట్టిన ఓ ఆకతాయిపై కాకినాడ వన్‌టౌన్ పోలీసులు కేసు నమోదు చేశారు. వివరాలిలా ఉన్నాయి. కాకినాడ ఏటిమొగకు చెందిన పట్టా వెంకటేశ్వర్లు ఈనెల 5న తన కుమారుడిని కాకినాడ జె.రామారావుపేటలోని బ్రాందీషాపునకు పంపి పాస్టర్స్ కంపెనీకి చెందిన రెండు బీర్‌లను రప్పించుకున్నాడు. అనంతరం ఒక బీర్ తాగాడు. మరో బీర్ మూత తీసేసరికి అది నీలం రంగులో ఉందని, అదేరోజు రాత్రి బ్రాందీ షాపునకు వెళ్లి అక్కడ సిబ్బందితో వాదనకు దిగాడు. దీంతో సిబ్బంది అధికారులకు తెలియజేయడంతో అసిస్టెంట్ రిటైల్ అవుట్ లెట్ మోనిటరింగ్ ఆఫీసర్ కృష్ణవేణి బృందం ఆ బీరు బాటిల్‌లోని ద్రవం నమూనాను ఆ బ్యాచ్‌కు మిగతా బీరుల నమూనాలను సేకరించి గుంటూరులోని ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ ల్యాబోరేటరీకి పంపారు. శనివారం వచ్చిన ల్యాబ్ నివేదికలో బీరులో కల్తీ జరగలేదని, వెంకటేశ్వర్లు కావాలని బీరులో సిరా కలిపి అధికారులను ఇబ్బంది పెట్టినట్లు నిర్ధారణకు వచ్చారు. అనంతరం ఎక్సైజ్ అధికారులు వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్‌లో ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఇన్‌స్పెక్టర్ సురేష్‌బాబు కేసు నమోదు చేశారు.

చెల్లూరులో జంగిల్ పీర్ బాబా గంధోత్సవం

రాయవరం, ఫిబ్రవరి 11: చెల్లూరు శివారు కృష్ణమ్మ చెరువు సమీపంలో జంగిల్ పీర్‌బాబా గంధోత్సవం ఆదివారంనిర్వహించారు. తొలుతగా గంధపు బిందెతో గ్రామోత్సవం నిర్వహించిన అనంతరం దర్గాకు చేరుకుని జెండా ఆవిష్కరించారు. వివిధ జిల్లాల నుంచి వచ్చిన భక్తులు గంధోత్సవంలో పాల్గొని మొక్కులు తీర్చుకున్నారు. నియోజకవర్గ జనసేన ఇన్‌చార్జ్ పోలిశెట్టి చంద్రశేఖర్, చిక్కాల దొరబాబు, షేక్ బాషా, అబ్దుల్ ఖలీల్, మహ్మద్ అబ్దుల్‌ఖాన్, షుగర్‌ఫ్యాక్టరీ జీఎం జి.కోటేశ్వరరావు పాల్గొన్నారు.

జనసేన పార్టీలో చేరికలు

అంబాజీపేట, ఫిబ్రవరి 11: జనసేన పార్టీ బలోపేతానికి ప్రతి ఒక్కరూ కృషిచేయాలని ఆ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ గిడ్డి సత్యనారాయణ సూచించారు. అంబాజీపేట కొర్లపాటివారిపాలెం లోని సామాజిక భవనంలో పార్టీ మండల నాయకులతో సమావేశం నిర్వహించారు. అనంతరం ఇరుసుమండకు చెందిన సుంకర సీతారామదాసునాయుడు ఆధ్వర్యంలో పలువురు కాపు యువత, దండోర నాయకులు జనసేన పార్టీలో చేరారు. వారికి పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించారు. పార్టీలో నాయకులను పార్టీ మండల అధ్యక్షుడు దొమ్మేటి సాయికృష్ణ సత్యనారాయణకు పరిచయం చేశారు. పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు శిరిగినీడి వెంకటేశ్వరరావు, కార్యదర్శి వాసంశెట్టి కుమార్, సాకా బాపూజీ, షైపాల తాతాజీ, అక్కిశెట్టి వీరవెంకట సత్యనారాయణ, చింతపల్లి సీతారామప్రసాద్, పితాని రామకృష్ణ, నేదునూరి పెద్దిరాజు, కొర్లపాటి గోపి, అరిగెల సూరిబాబు, ములపర్తి రమేష్, నందెపు చిన్న, అరిగెల బుజ్జి, వివిధ గ్రామాల పార్టీ నాయకులు పాల్గొన్నారు.

శ్రీనివాసరావు కుటుంబాన్ని ఆదుకోవాలి

ముమ్మిడివరం, ఫిబ్రవరి 11: కోడి కత్తి కేసులో నిందితుడు జనిపల్లి శ్రీనివాసరావుకు ప్రభుత్వం ఉద్యోగం ఇచ్చి ఆదుకోవాలని కుల వ్యతిరేక పోరాట సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆండ్ర మాల్యాద్రి డిమాండు చేశారు. కోర్టు బెయిల్ మంజూరు చేయడంతో ఇంటికి చేరుకున్న శ్రీనివాసరావు, వారి కుటుంబ సభ్యులను ఆదివారం ఠాణేలంకలో ఆండ్ర మాల్యాద్రి, జిల్లా నాయకుడు గుదే దుర్గాప్రసాద్, శెట్టిబత్తుల తులసీరావు, యలమంచిలి బాలరాజు, శరత్, అంబేడ్కర్‌ల బృందం పరామర్శించారు. ప్రభుత్వాలు చట్టాలను అమలు చేయడంలో నిర్లక్ష్య వైఖరి వల్ల బాధితుడు ఆరేళ్ల జైల్లో గడపాల్సి వచ్చిందన్నారు. సీఎం కోర్టుకు హాజరై సాక్ష్యం చెప్పకపోవడం వల్ల జైల్లో మగ్గి పోవాల్సి వచ్చిందన్నారు. అతనికి, అతని కుటుంబానికి రక్షణ కల్పించాలన్నారు.

నరసింహారావుకు టీడీపీ నాయకుల పరామర్శ

ముమ్మిడివరం, ఫిబ్రవరి 11: మాతృ వియోగంతో బాధపడుతున్న తాడి నరసింహారావు, సోదరుడు జానకీరామ్, సోదరి అల్లాడి రమణకుమారిలను టీడీపీ అమలాపురం పార్లమెంటరీ ఇన్‌చార్జి గంటి హరీష్‌మాధుర్, టీడీపీ నాయకులు ఆదివారం పరామర్శించారు. స్వర్గీయ తాడి తాతారావు సతీమణి పొన్నమ్మ చిత్రపటానికి పూలమాలలువేసి నివాళులర్పించారు. మాజీ మంత్రి పరమట వీరరాఘవులు, గుత్తుల సాయి, ఆకుల రామకృష్ణ, మందాల గంగసూర్యనారాయణ, వైసీపీ నాయకులు వంటెద్దు వెంకన్నాయుడు, గోదశి నాగేశ్వరరావు, కౌన్సిలర్ జి.మహాలక్ష్మి, సలాది బాబూరావు, మందపాటి కిరణ్, వాడ్రేవు వీరబాబు, చిక్కాల అంజిబాబు, సరిపెల్ల సత్తిబాబురాజు, బొక్కా రుక్మిణి, కొత్తూరి కాశీ, వలవల శివరావు, యాళ్ల ఉదయ్, టేకుమూడి లక్ష్మణరావు, మట్ట సత్తిబాబు నివాళులర్పించారు.

పంచముఖ ఆంజనేయస్వామి విగ్రహ ప్రతిష్ఠ

ఐ.పోలవరం, ఫిబ్రవరి 11: ఎదురులంక బ్రిడ్జి వద్ద నిర్మించిన 93 అడుగుల పంచముఖ ఆంజనేయస్వామి విగ్రహ ప్రతిష్ఠా మహోత్సవం ఆదివారం వైభవంగా జరిగింది. టీటీడీ ఆగమ పండితుడు సుదర్శనం వెంకటజనార్దనాచార్యులు ఆధ్వర్యంలో విగ్రహ ప్రతిష్ఠ జరిగింది. ఎమ్మెల్యే పొన్నాడ వెంకటసతీష్‌కుమార్ దంపతులు, భూపతిరాజు సుబ్రహ్మణ్యరాజు దంపతులు పూజా కార్యక్రమాలను నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు పూజల్లో పాల్గొన్నారు. పూర్ణాహుతి ఘనంగా జరిగింది. అన్నసమారాధన జరిగింది. ఎమ్మెల్సీ బొమ్మి ఇజ్రాయేలు, మాజీ ఎమ్మెల్యేలు దాట్ల బుచ్చిబాబు, చెల్లి వివేకానంద, మాజీఎమ్మెల్సీ చైతన్యరాజు, జడ్పీటీసీ ముదునూరి సతీష్‌రాజు,ఎంపీపీ మోర్త రాణిమిరియంజ్యోతి, నాయకులు పిన్నమరాజు శ్రీనురాజు, పెన్మెత్స వాసురాజు, కాలే రాజబాబు, కడియం తమ్మయ్య, కాటంశెట్టి రామమూర్తి, ఉప్పు వాసు, కొలిశెట్టి గంగబాబు, సుంకర నాగబాబు పాల్గొన్నారు.

బీసీలకు గుర్తింపు

మామిడికుదురు, ఫిబ్రవరి 11: బీసీలను గుర్తించింది వైసీపీ ప్రభుత్వమని ఎమ్మెల్సీ కుడుపూడి సూర్యనారాయణ అన్నారు. ఆదివారం మామిడికుదురు బీసీ సామాజిక భవనంలో వైసీపీలోని శెట్టిబలిజ నాయకుల సమావేశం ఆదివారం జరిగింది. కాండ్రేగుల శ్రీనివాస్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఎమ్మెల్సీ పాల్గొన్నారు. ఎమ్మెల్సీని స్థానిక నాయకులు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో దేవస్థానం చైర్మన్ చిట్టూరి రామకృష్ణ, పాశర్లపూడి సత్రం చైర్మన్ వాసంశెట్టి రామకృష్ణ, సర్పంచ్ చెల్లుబోయిన రామశివసుబ్రహ్మణ్యం, మాజీ ఎంపీటీసీలు యాండ్ర వీరబాబు, జోగి వెంకటరామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

వైసీపీ ప్రభుత్వ అరాచకాలపై లోకేశ్ శంఖారావం


మండపేట: మాట్లాడుతున్న వేగుళ్ల జోగేశ్వరరావు

మండపేట, ఫిబ్రవరి 11: సీఎం జగన్ ప్రభుత్వం చేస్తున్న అరాచకాలను ఎండగట్టేందుకు టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ పూరించిన నినాదమే శంఖారావమని ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు చెప్పారు. స్థానిక పార్టీ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. ప్రభుత్వ ప్రజావ్యతిరేక విధానాలను ప్రజలకు వివరించడంతో పాటు టీడీపీ, జనసేన ఉమ్మడి మేనిఫెస్టోను లోకేష్ ప్రజలకు వివరిస్తారని అన్నారు. వైసీపీ పాలనకు ప్రజలు చరమగీతం పాడే రోజులు దగ్గరపడ్డాయన్నారు. టీడీపీ, జనసేన అధికారంలోకి రావటం ఖాయమన్నారు. సమావేశంలో టీడీపీ నేతలు వాదా ప్రసాదరావు, నియోజకవర్గ ఎస్సీ సెల్ అధ్యక్షుడు మందపల్లి దొరబాబు, ఎం.రవీంద్రరెడ్డి, బడుగు రత్నంరాజు, హరి తదితరులు పాల్గొన్నారు.

జనసేన, టీడీపీ కూటమికి అనూహ్యస్పందన

ద్రాక్షారామ, ఫిబ్రవరి 11: టీడీపీ, జనసేన కూటమికి అనూహ్య స్పందన వస్తుండటంతో వైసీపీ కంగారు పడుతుందని టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి రెడ్డి సుబ్రహ్మణ్యం అన్నారు. ఆదివారం చోడవరం భవిష్యత్‌కు గ్యారెంటీ కార్యక్రమం జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి పోలిశెట్టి చంద్రశేఖర్‌తో కలిసి నిర్వహించారు. రెడ్డి సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ రాష్ట్ర అభివృద్ధికి టీడీపీ, జనసేన సంకీర్ణ ప్రభుత్వం అవసరమన్నారు. రాష్ట్రంలో వైసీపీ అరాచక విధానాలు అంతమొందించేందుకు వైసీపీ పార్టీని ఇంటికి సాగనంపాలన్నారు. టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రజా శ్రేయస్సే టీడీపీ ధ్యేయం

రావులపాలెం, ఫిబ్రవరి 11: టీడీపీ-జనసేన కూటమి అధికారంలోకి రాగానే పేదల అభ్యున్నతికి విశేష కృషి చేస్తామని మాజీఎమ్మెల్యే బండారుసత్యానందరావు అన్నారు. లక్ష్మీపోలవరంలో ఆదివారం బాబుష్యూరిటీ.. భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమం నిర్వహించారు.గ్రామంలోనూతనంగా ఏర్పాటుచేసిన టీడీపీ జెండా స్థూపాన్ని ప్రారంభించారు. 50మంది టీడీపీలో చేరగా వారికి ఆయన కండువాలువేసి ఆహ్వానించారు.గ్రామంలో ఇంటింటికీ పర్యటిస్తూ టీడీపీ-జనసేన ఉమ్మడి ప్రభుత్వం అధికారంలోకి రాగానే చేపట్టబోయే అభివృద్ధి పనులు, పథకాలను వివరించారు. టీడీపీ, నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

హైకోర్టు జడ్జి పూజలు

అయినవిల్లి, ఫిబ్రవరి 11: తెలంగాణ హైకోర్టు జడ్జి అభినందకుమార్ శివాలి ఆదివారం అయినవిల్లి శ్రీవిఘ్నేశ్వరస్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు జరిపించుకున్నారు. దర్శనం అనంతరం వీరికి అర్చకులు వేదాశీర్వచనం చేసి శేషవస్త్రంతో సత్కరించారు. స్వామివారి ప్రసాదాన్ని జడ్జికి అందజేశారు.

బాలుడికి ఆర్థిక సాయం

మామిడికుదురు, ఫిబ్రవరి 11: మొగలికుదురు హైస్కూలుకు చెందిన వాసంశెట్టి పూర్ణచంద్ర అనారోగ్యంతో బాధపడుతున్నాడు. 1996-97లో పదో తరగతి చదివిన విద్యార్థినీ విద్యార్థులు కొంతమంది కలిసి రూ.10వేలను, గల్ఫ్ యువనేస్తం సేవాసమితి సభ్యులు రూ.11వేలు కలిపి పూర్ణచంద్ర మేనమామకు నగరం గ్రామంలో ఆదివారం అందించారు. కార్యక్రమంలో దొంగ రామమోహన్, గుబ్బల గోవర్ధనపద్మ తదితరులు పాల్గొన్నారు.

శతాధిక వృద్ధురాలు మృతి

అంబాజీపేట, ఫిబ్రవరి 11: పుల్లేటికుర్రుకు చెందిన శతాధిక వృద్ధురాలు గంగుమళ్ళ వరలక్ష్మి(101) ఆదివారం మృతిచెందారు. ఆమెకు ముగ్గురు కుమార్తెలు, ఇద్దరు కుమారులు, మనమలు, మనవరాళ్ళు మునిమలు ఉన్నారు. పలువురు సంతాపం వ్యక్తం చేశారు.

వైసీపీని వీడి టీడీపీలో చేరిన ఉషారాణి


వైసీపీ జిల్లా సాంస్కృతిక మండలి అధ్యక్షురాలు ఆ పార్టీకి రాజీనామా చేసి టీడీపీలో చేరిన దృశ్యం

కొత్తపేట, ఫిబ్రవరి 11: వైసీపీ సాంస్కృతిక మండలి జిల్లా అధ్యక్షురాలు, కొత్తపేట ఎస్ఎస్ఆర్ విద్యా సంస్థల అధినేత్రి, సామాజికవేత్త వేత్తసత్తిరాజుఉషారాణి వైసీపీని వీడి టీడీపీలో చేరారు. ఆదివారం ఆమె స్వగృహానికి టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు బండారు సత్యానందరావు వెళ్లి ఉషారాణికి కండువా వేసి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా సత్యానందరావు మాట్లాడుతూ ఎంతోమంది విద్యార్థులను తీర్చిదిద్దిన మహిళగా, సామాజికవేత్తగా పోరాట పటిమగల ఉషారాణి టీడీపీ కుటుంబంలో చేరడం సంతోషకరమన్నారు. ఉషారాణి మాట్లాడుతూ టీడీపీ-జనసేన ప్రభుత్వ ఏర్పాటులో, సత్యానందరావు విజయానికి కృషి చేస్తానని తెలిపారు. టీడీపీ నాయకులు బూసి జయలక్ష్మిభాస్కరరావు, కంఠంశెట్టి శ్రీనివాసరావు, వాసంశెట్టి సత్యనారాయణ, దర్నాల రామకృష్ణ, బండారు వెంకటసత్తిబాబు, ముత్యాల బాబ్జీ, యల్లమిల్లి జగన్మోహనరావు, గుబ్బల మూర్తి, వైపె రాంబాబు, నల్లా వెంకటరమణ, కముజు గంగాధర్, పెనుమళ్ళ అన్నవరం, మిద్దే ఆదినారాయణ, బూసి విష్ణుమూర్తి పాల్గొన్నారు.

టిడ్కో గృహాల్లో మౌలిక సదుపాయాలేవి!


మాట్లాడుతున్న రెడ్డి సుబ్రహ్మణ్యం

రామచంద్రపురం, ఫిబ్రవరి 11: టీడీపీ ప్రభుత్వ హయాంలో నిర్మించిన టిడ్కో గృహాలకు వైసీపీ ప్రభుత్వం మౌలిక వసతులు కూడా కల్పించలేక పోయిందని టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ రెడ్డి సుబ్రహ్మణ్యం విమర్శించారు. ఆదివారం టీడీపీ, జనసేన ఇన్‌చార్జ్‌లు రెడ్డి సుబ్రహ్మణ్యం, పోలిశెట్టి చంద్రశేఖర్ ఆధ్వర్యంలో అధిక సంఖ్యలో నాయకులు, కార్యకర్తలు 1వ వార్డు కొత్తూరులో ఉన్న టిడ్కో గృహాలను సందర్శించారు. అక్కడనివశిస్తున్న కాలనీవాసుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. రాబోయే టీడీపీ, జనసేన ఉమ్మడి ప్రభుత్వంలో రాష్ట్ర వ్యాప్తంగా వున్న టిడ్కో గృహాలను చంద్రబాబునాయుడు ఆధ్వర్యంలో అధునాతన అపార్ట్‌మెంట్లుగా మారుస్తామని ఆర్ఎస్ హామీ ఇచ్చారు. టీడీపీ పట్టణ అధ్యక్షుడు కడియాల రాఘవన్, తెలుగు యువత రాష్ట్ర ఉపాధ్యక్షుడు అక్కల రిష్వంత్‌రాయ్, టీడీపీ నాయకులు కవల నానాజీ, జనసేన నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

టీడీపీలో అగ్నికుల క్షత్రియుల చేరిక


ఆలమూరులో మాజీ ఎమ్మెల్యే బండారు సమక్షంలో పార్టీలో చేరిన నాయకులు

ఆలమూరు, ఫిబ్రవరి 11: ఆలమూరుకు చెందిన అగ్నికుల క్షత్రియులు అంగాని శ్రీనివాస్, రేఖాడి రాజు, ఆకుల శ్రీను, లంకే ఏసు, లంకే రాజేష్, మల్లాడి శ్రీనివాస్, లంకే కాటంరాజు, డొక్కాడి హరిబాబు, వనమాడి బుల్లిరాజు, కర్రి సాయిబాబు, కర్రి శ్రీనివాస్, రేఖాడి శ్రీనివాస్, వనమాడి రామకృష్ణ, మల్లాడి మోహన్, కోలాటి రాజు ఆదివారం టీడీపీలో చేరారు. వారికి ఆ పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే బండారు సత్యానందరావు కండువాలు వేసి ఆహ్వానించారు. కార్యక్రమంలో ఆలమూరుకు చెందిన పలువురు టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

టీడీపీలో పలువురు చేరికలు

మండపేట, ఫిబ్రవరి 11: ఎన్నికలు నాటిని నియోజకవర్గంలో వైసీపీ ఖాళీకావటం ఖాయమని టీడీపీ నేతలు అన్నారు. రాయవరం మండలం సోమేశ్వరానికి చెందిన శెట్టిబలిజ సంఘ నాయకుడు కడియాల వెంకటరమణ, కోనా పద్మారావు, తడాల సత్యనారాయణ, జోడా మదన కామరాజులు అనుచరులతో కలిసి టీడీపీ అమలాపురం పార్లమెంట్ ఉపాధ్యక్షుడు వై.ఆర్‌కె.పరమహంస నేతృత్వంలో మండపేట టీడీపీ కార్యాలయంలో ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు సమక్షంలో టీడీపీలో చేరారు. వారికి వేగుళ్ల టీడీపీ కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో గుత్తుల శ్రీనివాస్, కాళ్లమణి ప్రసాద్, నల్లి వెంకటరమణ, గుత్తులు వీరన్న, కురుపూడి ఉమాశ్రీనివాస్, శాఖా శ్రీను తదితరులు వున్నారు.

కేంద్ర ప్రభుత్వ పథకాలను ప్రజలకు వివరించాలి


క్యాలెండర్లు, కరపత్రాలు పంపిణీ చేస్తున్న దొరబాబు

అమలాపురం టౌన్, ఫిబ్రవరి 11: కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలను పల్లెకుపోదాం కార్యక్రమంలో భాగంగా ప్రతీ ఇంటికీ చేరవేయాలని బీజేపీ జిల్లా శాఖ అధ్యక్షుడు యాళ్ల వెంకటరామమోహనరావు(దొరబాబు) పేర్కొన్నారు. యువమోర్చా జిల్లాశాఖ అధ్యక్షుడు కొండేటి ఈశ్వర్‌గౌడ్, ప్రవాసీ కార్యకర్త జగతా శాంతిల ఆధ్వర్యంలో అమలాపురం 23వ వార్డులో గావ్‌చలో అభియాన్ కార్యక్రమం ఆదివారం నిర్వహించారు. ఉజ్వల పథకం, ఆయుష్మాన్ భారత్ వంటి అనేక పథకాలను వివరిస్తూ దొరబాబు ఆధ్వర్యంలో ఇంటింటికీ తిరిగి కరపత్రాలు, క్యాలెండర్లను పంపిణీ చేశారు. జిల్లా ప్రధాన కార్యదర్శి మోకా వెంకటసుబ్బారావు, అసెంబ్లీ కన్వీనర్ బీఎస్ మూర్తి, యువమోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శి బొంతు శివాజీ, నాయకులు కాశి ఫణీంద్ర, అరిగెల తేజవెంకటేష్, డేగల వెంకటరామన్, నల్లా సత్తిబాబు, బీఎస్ వర్మ, చిక్కాల శ్రీనివాసరావులతో పాటు పలువురు కార్యకర్తలు పాల్గొన్నారు.

కేంద్ర ప్రభుత్వ పథకాల ప్రచారం

మలికిపురం, ఫిబ్రవరి 11: ప్రధానమంత్రి మోదీ అమలు చేస్తున్న పథకాలను ప్రతీ పల్లెకు చేరవేయాలని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు అడబాల సత్యనారాయణ అన్నారు. పల్లెకుపోదాంలో భాగంగా పడమటిపాలెంలో జెండాను ఆవిష్కరించారు. అనంతరం పార్టీ మండల అధ్యక్షుడు కె.కనకేశ్వరరావు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలోఆయన మాట్లాడారు. రాబోయే ఎన్నికల్లో బీజేపీని ఆశీర్వదించాలని కోరారు. ఎం.తాతంబాబు, కె.పల్లపురాజు, తారక్, బి.పెద్దిరాజు పాల్గొన్నారు.

మామిడికుదురులో పల్లెకుపోదాం

మామిడికుదురు, ఫిబ్రవరి 11: బీజేపీ నిర్వహిస్తున్న పల్లెకుపోదాం కార్యక్రమం ఆదివారం మూడో రోజు మామిడికుదురులో జరిగింది. కేంద్ర అందిస్తున్న పలు పథకాలతో ముద్రించిన కరపత్రాలను గ్రామంలో బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు మానేపల్లి అయ్యాజీవేమా పంచిపెట్టారు. మెండా ఆదినారాయణ, కటికిరెడ్డి తమ్మయ్యనాయుడు, వేగి వెంకటేశ్వరరావు, కంకిపాటి సుబ్బారావు, పితాని శ్రీనివాస్ పాల్గొన్నారు.

దళితుడిని ప్రధాని కాకుండా అడ్డుకున్న చరణ్‌సింగ్‌కు భారతరత్నా!

అమలాపురం రూరల్, ఫిబ్రవరి 11: దళితుడిని ప్రధానమంత్రి కాకుండా అడ్డుకున్న మాజీ ప్రధాని చరణ్‌సింగ్‌కు భారతరత్న ఇవ్వడం శోచనీయమని ఏపీ ఎమ్మార్పీఎస్ రాష్ట్ర కన్వీనర్ మోకాటి నాగేశ్వరరావు ధ్వజమెత్తారు. స్వాతంత్ర్యోద్యమంలో దేశం కోసం ప్రాణాలు సైతం లెక్క చేయకుండా జైలు జీవితం గడిపిన డాక్టర్ బాబూ జగ్జీవన్‌రామ్‌కు భారతరత్న ఇవ్వకపోవడం బీజేపీ ప్రభుత్వ కులవివక్షతకు అద్దం పడుతుందన్నారు. జిల్లా మాదిగల జేఏసీ అధ్యక్షుడు కాప నాగభూషణం అధ్యక్షతన ఆదివారం నడిపూడి బాబూజగ్జీవన్‌రామ్ భవన్‌లో మాదిగల జేఏసీ సమావేశం నిర్వహించారు. ఏఐసీసీ సభ్యుడు యార్లగడ్డ రవీంద్ర, సీనియర్ నాయకులు దార్ల చిన సత్యనారాయణ, తొత్తరమూడి ప్రభాకరరావు, చుట్టుగుళ్ల అన్నవరం, చాట్ల సత్యనారాయణ, చుట్టుగుళ్ల వెంకటరమణ, మంద వెంకటేశ్వరరావు, నేదునూరి లక్ష్మణరావు, సవరపు సూర్యనారాయణ, ఉందుర్తి సత్యనారాయణ, పెదపూడి శ్రీనివాస్, కొమానపల్లి కోటేశ్వరరావు, యార్లగడ్డ ఆదినారాయణ, కన్నెపాముల చిన్నా పాల్గొన్నారు.

ఎంపీఎస్ పాఠశాల వార్షికోత్సవం

మండపేట, ఫిబ్రవరి 11:విలువలతో కూడిన విద్యను విద్యార్థులకు బోధించాలని ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు అన్నారు. స్థానిక ఎంపీఎస్ పాఠశాలలో శనివారం రాత్రి పాఠశాల చైర్మన్ వల్లూరి చిన్నారావు అధ్యక్షతన పాఠశాల 24వ వార్షికోత్సవం జరిగింది. కార్యక్రమానికి ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు, మున్సిపల్ మాజీ చైర్మన్ చుండ్రు శ్రీవరప్రకాష్ హాజరయ్యారు. విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి.

తెలంగాణ రాష్ట్ర సహ ఇన్‌చార్జిగా పవన్‌కుమార్



అమలాపురం టౌన్, ఫిబ్రవరి 11: బీజేపీ ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన గ్రామ పరిక్రమ యాత్ర తెలంగాణ రాష్ట్ర సహ ఇన్‌చార్జిగా అమలాపురం పట్టణానికి చెందిన కిసాన్‌మోర్చా జాతీయ కార్యవర్గ సభ్యుడు నల్లా పవన్‌కుమార్‌ను నియమించారు. జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా ఉత్తర్వులు ఇచ్చారు. ఈనెల12 నుంచి మార్చి 12వరకు గ్రామ పరిక్రమ యాత్ర జరుగుతుంది. తెలంగాణలో పర్యటించి యాత్ర విజయవంతానికి కృషి చేస్తానని పవన్ చెప్పారు.

అరుణాచల గిరి ప్రదక్షిణకు ఆర్టీసీ ప్రత్యేక బస్సులు

రావులపాలెం, ఫిబ్రవరి 11: మాఘ పౌర్ణమిని పురస్కరించుకుని అరుణాచల గిరి ప్రదక్షిణకు ఈనెల22న రావులపాలెం డిపో నుంచి ఆర్టీసీ ప్రత్యేక బస్సులు బయలుదేరతాయని మేనేజరు కేడీఎంఎస్ కుమార్ తెలిపారు. 22న బయల్దేరే కాణిపాకం, శ్రీపురం, అరుణాచలం, శ్రీకాళహస్తి, విజయవాడ దర్శనాల 25న రావులపాలెం చేరుకుంటుందన్నారు. టిక్కెట్టు ధర మనిషికి రూ.3,200. వివరాలకు అసిస్టెంట్ మేనేజరును 7382911871 నెంబరులో సంప్రదించాలని కోరారు.


సహచర ఉపాధ్యాయుడికి రూ.1.51లక్షల సాయం

అమలాపురం టౌన్, ఫిబ్రవరి 11: బట్టేలంక జడ్పీ ఉన్నత పాఠశాలలో స్పెషల్ ఎడ్యుకేషన్ టీచరుగా పనిచేస్తున్న డాక్టర్ శివరాజు సతీమణి ఏడో నెల గర్భిణీగా అమలాపురం ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్సకు రాగా ఆమె గర్భంలో ముగ్గురు పిల్లలు ఉన్నారని, అత్యవసరంగా ఆపరేషన్ చేయాలని వైద్యులు నిర్ధారించారు. ఆపరేషన్‌చేసి ముగ్గురు బిడ్డలను నియోనేతల్ సూపర్ స్పెషాలిటీ కేర్‌లో ఉంచారు. తక్షణం స్పందించిన మలికిపురం ఎస్టీయూ మండలశాఖ రూ.91వేలు, సఖినేటిపల్లి మండలశాఖ రూ.35వేలతో పాటు హోప్ ది హెల్పింగ్ హ్యాండ్స్ ఫౌండర్ శ్రీనివాస్ రూ.25వేలు అందించగా రూ.1.51లక్షల నగదును శివరాజుకు ఎస్టీయూ జిల్లాశాఖ అధ్యక్షుడు పోతంశెట్టి దొరబాబు, జిల్లా ప్రధాన కార్యదర్శి సరిదే సత్యపల్లంరాజు, ఆర్థిక కార్యదర్శి సత్యనారాయణ, ఎస్టీయూ సీనియర్ నాయకుడు నాగిరెడ్డి శివప్రసాద్, పిండి ప్రసాద్, కొమ్ముల సత్యరమేష్, చిక్కం హరిబాబు అందజేసారు. దాతృత్వం చాటుకున్న ఎస్టీయూ మండలశాఖల ప్రతినిధులు నారాయణస్వామి, కేఆర్ఎస్ సత్యనారాయణ, గుబ్బల శ్రీనివాస్, ఉండపల్లి గిరిబాబు, నందెపు శ్రీనివాస్ తదితరులను పలువురు అభినందించారు.

జనసేన బలోపేతానికి కృషి చేయాలి

పి.గన్నవరం, ఫిబ్రవరి 11: గ్రామస్థాయిలో జనసేన పార్టీ బలోపేతానికి కృషి చెయ్యాలని పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ గిడ్డి సత్యనారాయణ కోరారు. పి.గన్నవరంలో జనసేన పార్టీ మండల అధ్యక్షుడు సాధనాల శ్రీవెంకటసత్యనారాయణ అధ్యక్షతన జరిగిన జనసేన సమావేశంలో నూతనంగా ఎన్నికైన గ్రామశాఖ సభ్యులను ఆయన అభినందించి అనంతరం మాట్లాడారు. తొలుత పి.గన్నవరం గ్రామశాఖ అధ్యక్షుడిగా కర్రి వెంకటరత్నం(బాబూరావు), ప్రధాన కార్యదర్శిగా కోట రాజేంద్రప్రసాద్, ఉపాధ్యక్షులుగా బోడపాటి తాతాజీలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కార్యక్రమంలో వాసంశెట్టి కుమార్, తాటికాయల వెంకటేష్, షేక్ దొరబాబు, యడ్ల ఏసుభాస్కరరావు, తాటికాయల శ్రీనువాస్, నేరెడిమిల్లి రఘు, అడ్డగళ్ల సిరిజ్యోతి, తానంకి నాగరాజు, కొండా చిన్ని సుంర నందు, సాధనాల కాశికృష్ణ, నల్లా దుర్గారావు, చినిమిల్లి కొండయ్య, బొడపాటి శ్రీనివాసరావు, మూలయ్య పాల్గొన్నారు.

ఎస్ఐగా అశోక్



కొత్తపేట, ఫిబ్రవరి 11: కొత్తపేట ఎస్ఐగా ఎం.అశోక్ ఆదివారం బాధ్యతలు చేపట్టారు. మండపేటటౌన్ నుంచి బదిలీపై ఇక్కడకు వచ్చారు. ప్రస్తుతం ఎస్ఐగా ఉన్న జ్వాలాసాగర్ అదనపు ఎస్ఐగా విధులు నిర్వర్తించనున్నారు.

సినిమా గైడ్

అమలాపురం

వెంకటరామ	: అంబాజీపేట మ్యారేజీ బ్యాండు
వెంకటరమణ	: ఈగల్
శ్రీలలిత	: లాల్‌సలామ్
శేఖర్ స్ర్కీన్-1	: హనుమాన్
శేఖర్ స్ర్కీన్-2	: ట్రూ లవర్
రమా	: గుంటూరు కారం
గణపతి	: నాసామిరంగ
వెంకటపద్మావతిస్ర్కీన్-1	: యాత్ర-2
వెంకటపద్మావతి స్ర్కీన్-2	: గేమ్ ఆన్

ఆరోగ్య పరిరక్షణలో ముందున్న వాకర్స్ క్లబ్‌లు

అమలాపురం టౌన్, ఫిబ్రవరి 11: ఆరోగ్య పరిరక్షణలో వాకర్స్ క్లబ్‌లు ముందుంటున్నాయని మెడ్ యునైటెడ్ వైద్యుడు డాక్టర్ మానుకొండ జాయ్‌సన్ పేర్కొన్నారు. అమలాపురం వాకర్స్ హెల్త్ క్లబ్, మహిళా వాకర్స్ హెల్త్ క్లబ్ సంయుక్త ఆధ్వర్యంలో ఎస్‌కేబీఆర్ కళాశాలలో ఆదివారం క్లబ్ అధ్యక్షుడు బోనం సత్యవరప్రసాద్ అధ్యక్షతన ఆరోగ్య సదస్సు నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన డాక్టర్ జాయ్‌సన్ మధుమేహం, కిడ్నీ, ఇతర అనారోగ్య సమస్యలను పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. డాక్టర్ సీహెచ్ విష్ణుమూర్తి ఆరోగ్య సమస్యలు పరిష్కార మార్గాలను తెలిపారు. క్లబ్ తరఫున వైద్యులను సత్కరించారు. మహిళా వాకర్స్ క్లబ్ అధ్యక్షురాలు భమిడిపాటి పద్మావతి, కార్యదర్శి వలవల వెంకటరెడ్డినాయుడు, కోశాధికారి పచ్చిగోళ్ల రాజా, యర్రమిల్లి అనంతలక్ష్మి, డాక్టర్ గోకరకొండ నాగేంద్ర, యర్రమిల్లి సత్యనారాయణమూర్తి, పుత్సా కృష్ణకామేశ్వర్, గోటేటి గంగాధర్ పాల్గొన్నారు.

వివాహ వ్యవస్థ భారతీయ సంస్కృతికి ఆయువుపట్టు

రామచంద్రపురం, ఫిబ్రవరి 11: వివాహ వ్యవస్థ భారతీయ సంస్కృతికి ఆయువు పట్టు అని మోడరన్ విద్యా సంస్థల అధినేత లయన్. జి.వి.రావు అన్నారు. ప్రపంచ వివాహ దినోత్సవాన్ని పురస్కరించుకుని 10వతరగతి విద్యార్థుల విజయభేరి కార్యక్రమం నిర్వహించారు. విద్యార్థుల తల్లిదండ్రులను జి.వి.రావు ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో అకడమిక్ డైరెక్టర్ ఆర్.ఉమాదేవి, హెచ్ఎం ఎం.చిట్టిబాబు, అధ్యాపకులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

రెడ్ క్రాస్ లైఫ్ మెంబర్‌గా తొగరు మూర్తి ఎంపిక

రామచంద్రపురం, ఫిబ్రవరి 11: ఇండియన్‌రెడ్ క్రాస్‌సొసైటీ లైఫ్ మెంబర్‌గా తొగరు మూర్తిని నియమించినట్లు ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ కార్యదర్శి డాక్టర్ పి.ఎస్.శర్మ తెలిపారు. లైఫ్‌మెంబర్ షిప్‌కార్డు, ధ్రువీ కరణ పత్రాలను తొగరు మూర్తికి అందజేసినట్లు తెలిపారు. తొగరు మూర్తి మాట్లాడుతూ 20ఏళ్లుగా పేదవిద్యార్థులకు ఉచితంగా పుస్తకాలు పంపిణీ చేస్తున్నామని, గర్భిణులు, రోగులు వందలాది మందికి రక్తం అందించామన్నారు.

గుర్తుతెలియని మృతదేహం లభ్యం

కొత్తపేట, ఫిబ్రవరి 11: రావులపాలెం-కొత్తపేట ప్రధాన పంట కాల్వలో ఏనుగుల మహల్ సమీపంలో ఆదివారం గుర్తు తెలియని మృతదేహం లభ్యమైంది. పోలీసులు మృతదేహాన్ని పంట కాలువ నుంచి వెలికితీయించి ఏరియా ఆసుపత్రి మార్చురీకి తరలించారు.మృతదేహంపై నీలిరంగు చొక్కా కలిగి ఉండి సుమారు 35నుండి 40ఏళ్ల వయసు కలిగిన మగ వ్యక్తిదిగా గుర్తించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్టు ఏఎస్ఐ జీవీ కృష్ణారావు తెలిపారు.

సొసైటీ అధ్యక్షుడిగా ఏడుకొండలు

కె.గంగవరం, ఫిబ్రవరి 10: అముజూరు సొసైటీ అధ్యక్షుడిగా సాదే ఏడుకొండలు ఆదివారం ప్రమాణస్వీకారం చేశారు. సభ్యులుగా మేడిశెట్టి శివప్రసాద్, రాయుడు రాములు ప్రమాణస్వీకారం చేశారు. అయితే వీరిద్దరూ పాత కమిటీ సభ్యులే. గత కమిటీ చైర్మన్ యర్రంశెట్ల బాలబాలాజీ కొద్ది రోజుల క్రితం టీడీపీలో చేరిన వైసీపీ నాయకుడు రేవు శ్రీనుకు బంధువు కావడంతో చైర్మన్‌ను మార్చినట్లు తెలిసింది. వైసీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ పల్లి సూర్యప్రకాష్, సర్పంచ్ నానా వరపు కళ్యాణి శ్రీనివాస్, వైస్ ఎంపీపీ నీతిపూడి మధుబాల వెంకట్రావు, సొసైటీ మాజీ అధ్యక్షులు చిట్టూరి చిన్నీ, వల్లభరెడ్డి చిన్నీ, నాయకులు పెట్టా శ్రీనివాసరావు పాల్గొన్నారు.

మద్దుల మోహన సేవలు మరువలేనివి

పి.గన్నవరం, ఫిబ్రవరి 11: టీడీపీకి మద్దుల మోహన చేసిన సేవలు మరువలేనివని టీడీపీ పార్లమెంటరీ ఇన్‌చార్జ్ గంటి హరీష్‌మాధుర్ కొనియాడారు. మానేపల్లి మద్దుల మోహన నివాసంలో జరిగిన సంతాప సభలో ఆయన మాట్లాడారు. అనంతరం ఆమె కుమార్తె అనూరాజేశ్వరిని పరామర్శించి మోహన చిత్రపటం వద్ద నివాళులర్పించారు. అలాగే శాసనమండలి మాజీ డిప్యూటీ చైర్మన్ రెడ్డి సుబ్రహ్మణ్యం, మాజీ ఎమ్మెల్యే మానేపల్లి అయ్యాజీవేమా, టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి డొక్కా నాథ్‌బాబులు మోహన చిత్రపటానికి పూలమాలలువేసి నివాళులర్పించారు. సంతాపసభలో మట్టపర్తి రామకృష్ణ, దాసరి వీరవెంకటసత్యనారాయణ, తోలేటి సత్తిబాబు, నాగాబత్తుల సుబ్బారావు, సంసాని పెద్దిరాజు, మోకా పార్వతి, పెచ్చెట్టి వీరవెంకటసత్యనారాయణ, యల్లమిల్లి రామమోహనరావు, పితాని శ్రీనివాస్ పాల్గొన్నారు.

తహసీల్దార్‌కు సన్మానం



ఉప్పలగుప్తం, ఫిబ్రవరి 11: బదిలీపై వెళ్లిన తహసీల్దారు జవ్వాది వెంకటేశ్వరిని రాష్ట్ర ఉద్యానవన విశ్వవిద్యాలయం బోర్డు డైరెక్టర్ జిన్నూరి వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో నంగవరంలో ఆదివారం సన్మానించారు. కార్యక్రమంలో ఎంపీటీసీ వంగా గిరిజానాగకుమారి, మాజీ సర్పంచ్ శీలం సూరిబాబు, వ్యవసాయ సలహా మండలి సభ్యుడు రాయపురెడ్డి నాగు పాల్గొన్నారు.

సుందరపల్లి శివాలయానికి విరాళాల వెల్లువ
రూ.2లక్షలు విరాళం అందజేసిన రేవు శ్రీను

కె.గంగవరం, ఫిబ్రవరి 10: సుందరపల్లిలో నిర్మిస్తున్న శివాలయానికి విరాళాలు వెల్లువెత్తుతున్నాయి. కోటిపల్లికి చెందిన టీడీపీ సీనియర్ నాయకుడు పప్పుల మసేను వెంకన్న(రేవుశ్రీను) రూ.2లక్షల ఆలయ కమిటీ సభ్యులకు అందజేశారు. టీడీపీ నాయకుడు రాయపురెడ్డి సూరిబాబు(రాజా), జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జ్ పోలిశెట్టిచంద్రశేఖర్ రూ.50వేలుచొప్పున అందజేశారు.

రుద్రయ్య మెమోరియల్ ట్రస్ట్ సేవలు అభినందనీయం

కపిలేశ్వరపురం, ఫిబ్రవరి 11: బలుసు రుద్రయ్య మెమోరియల్ ట్రస్ట్ సేవలు అభినందనీయమని ఎమ్మెల్యే వేగుళ్ళ జోగేశ్వరరావు, ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు అన్నారు. ఆదివారం అంగర పీహెచ్‌సీ ఆవరణలో భార్య వసుంధర జ్ఞాపకార్థం డా. బలుసు సుబ్బారావు రూ.50లక్షల విరాళంతో నూతనంగా నిర్మించనున్న భవనానికి వారు శంకుస్థాపన చేసారు. జడ్పీటీసీ పుట్టపూడి అబ్బు, ఎంపీపీ మేడిశెట్టి సత్యవేణి దుర్గారావు, గ్రామసర్పంచ్ వాసా కోటేశ్వరరావు, తిరునాతి వెంకటేశ్వర్లు, బలుసు జానకి రామయ్య, టీడీపీ నాయకులు పుత్సల శ్రీనివాస్, వైద్య, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

కిడ్నీ బాధిత విద్యార్థికి రూ.1.50లక్షల సాయం

రాజోలు, ఫిబ్రవరి 11: పొన్నమండకు చెందిన బాలుడు బళ్ల రామయోచన్ రెండు కిడ్నీలు పాడైపోయి కాకినాడ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. నవ్యసాయిశ్రీ ఇంటర్ విద్యార్థిని పెట్టిన పోస్టుతో మామిడికుదురు మండలం మొగలికుదురు జడ్పీ పాఠశాల 1995-96 పూర్వవిద్యార్థులు బొక్కా శ్రీను, మామిడి సూర్యభగవాన్, అలీఅబ్బాస్ చొరవతో స్నేహితులంతా కలిసి బాలుడి వైద్య ఖర్చుల కోసం రూ.1.50లక్షలు విరాళాలు సేకరించి కుటుంబ సభ్యులకు అందజేశారు.

బౌద్ధ సమ్మేళనాన్ని విజయవంతం చేయండి

రామచంద్రపురం, ఫిబ్రవరి 11: విశాఖపట్నంలో ఈనెల25,26 తేదీల్లో జరిగే 11వ బౌద్ధ మహా సమ్మేళనాన్ని విజయవంతంచేయాలని రాష్ట్ర బుద్ధిస్టు సొసైటీ ఆఫ్ ఇండియా వర్కింగ్ ప్రెసిడెంట్ పిల్లి రాంబాబు పిలుపునిచ్చారు. స్థానిక చెలికాని రామారావు స్మారకభవనంలో నిర్వహించిన బీఎస్ఐ సమావేశంలో ఆయన మాట్లాడారు. బౌద్ధ సమ్మేళన కరపత్రాన్ని, భారతదేశ జాతీయ చిహ్నాలను, బౌద్ధం అనే క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. బీఎస్ఐ రాష్ట్ర న్యాయ సలహాదారుడు కె.భరత్‌కుమార్, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు పిల్లి మురళీమోహన్ వెంకటరమణ, కార్యదర్శి వాడ్రేవు సాయిప్రసాద్, ఉపాధ్యక్షులు పలివెల సత్యనారాయణ, యడ్ల కుటుంబరావు, బీఎస్ఐ నాయకులు పాల్గొన్నారు.

సారా బట్టీలపై ఎస్ఈబీ దాడులు

కపిలేశ్వరపురం/ఆలమూరు, ఫిబ్రవరి11: కోరుమిల్లిలంక పొలాల్లో ఆదివారం ఎస్ఈబీ సీఐ అబ్దుల్‌ఖాదీర్, అంగర ఎస్ఐ పరదేశి ఆధ్వర్యంలో దాడులు నిర్వహించారు. 500లీటర్ల బెల్లం ఊటను ధ్వంసం చేసి, సారా తయారీ సామగ్రిని స్వాధీనం చేసుకున్నారు. ఎస్ఈబీ ఎస్ఐ సత్యవాణి, సిబ్బంది పాల్గొన్నారు.

హనుమాన్ ఆలయ వార్షికోత్సవం

ఆత్రేయపురం, ఫిబ్రవరి 11: బొబ్బర్లంకలో అభయహస్త ఆంజనేయస్వామి ఆలయ 17వ వార్షికోత్సవం ఆదివారం నిర్వహించారు. హనుమాన్‌కు గంధసిందూరం, తమలపాకులతో ప్రత్యేకపూజలు జరిపి హనుమాన్‌చాలీసా పారాయణ చేశారు. ఎమ్మెల్యే చిర్ల జగ్గిరెడ్డి, మాజీ ఎమ్మెల్యే బండారు సత్యానందరావు, భక్తులు స్వామివారిని దర్శించుకుని తీర్థ, ప్రసాదాలు స్వీకరించారు.

వాసవి అమ్మవారి ఆత్మార్పణ దినోత్సవం

ఆత్రేయపురం, ఫిబ్రవరి 11: ఆత్రేయపురంలోని సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయ ప్రాంగణంలో వాసవీ క్లబ్ ఆధ్వర్యంలో శ్రీవాసవి కన్యకాపరమేశ్వరి అమ్మవారి ఆత్మార్పణ దినోత్సవం నిర్వహించారు. అమ్మవారికి కుంకుమ పూజలు, వాసవి గాయత్రి మంత్రజపం, అష్టోత్తరాన్ని సామూహికంగా జరిపారు. ఆర్యవైశ్య మహిళలు భక్తిశ్రద్ధలతో పూజలు చేశారు.

ఎస్ఐగా రాజేష్



రావులపాలెం, ఫిబ్రవరి 11: రావులపాలెం ఎస్ఐగా కె.రాజేష్ ఆదివారం బాధ్యతలు స్వీకరించారు. కృష్ణా జిల్లా నుంచి ఆయన బదిలీపై ఇక్కడకు వచ్చారు.

అన్ని రంగాలను నిర్వీర్యం చేసిన వైసీపీ ప్రభుత్వం

అంబాజీపేట, ఫిబ్రవరి 11: వైసీపీ ప్రభుత్వం అన్ని రంగాలను నిర్వీర్యం చేసిందని బీజేపీ రాష్ట్ర నాయకుడు కొల్లి సూర్యారావు అన్నారు. మొసలపల్లి, గంగలకుర్రు అగ్రహారం, గంగలకుర్రు గ్రామాల్లో పల్లెకుపోదాం కార్యక్రమాన్ని నిర్వహించారు. విద్యా, వైద్య రంగాలను నిర్లక్ష్యం చేయడంతో సామాన్య మధ్య తరగతి ప్రజల జీవన విధానం ప్రశ్నార్థకంగా మారిందన్నారు. గుంటూరి సత్యవర్మ, గోవిందవఝుల బాలకృష్ణమూర్తి, కముజు శ్రీను, అప్పన గణపతిరావు, గొల్ల రాము పాల్గొన్నారు.